ఆశ వర్కర్స్ యూనియన్
నూతన జిల్లా కమిటీ ఎన్నిక

కామారెడ్డి టౌన్, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యవర్గాన్ని శనివారం ఏర్పాటు చేశారు. జిల్లా గౌరవ అధ్యక్షుడిగా చంద్రశేఖర్, జిల్లా అధ్యక్షురాలిగా ఇందిర, కార్యదర్శిగా రాజశ్రీ, కోశాధికారిగా మమత, ఉపాధ్యాక్షులుగా మంజుల, నాగమణి, అనిత, సహాయ కార్యదర్శులుగా విజయ, లావణ్య, పల్లవిలతో కూడిన కార్యవర్గాన్ని ఏర్పాటు చేశారు.



నడి వయసులోనూ..
నడుము వంచలేక..

మానవ శరీరంలో కీళ్ల కదలిక చాలా ముఖ్యం. అవి అరిగిపోతే ఇతర అవయవాలపైన ప్రభావం చూపే ప్రమాదం ఉంది. అందుకే సరైన సమయంలో గుర్తించి చికిత్స చేయించుకోవాలి. లేదంటే అంగవైకల్యం బారిన పడే ప్రమాదం కూడా ఉందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో కీళ్లనొప్పులతో బాధపడే వారి సంఖ్య రోజు రోజుకూ పెరుగుతోంది. ఆర్థరైటిస్ వైద్యుల దవాఖానాల ముందు నిత్యం రద్దీ కనిపిస్తోంది. అధిక సమయం కూర్చుని పని చేయడం, శరీరానికి వ్యాయామం లేకపోడంతో ఈ సమస్యలకు కారణమవుతున్నాయి. ఆదివారం 'ప్రపంచ ఆర్థరైటిస్ డే' సందర్భంగా ప్రత్యేక కథనం..

- అధికం అవుతున్న కీళ్ల సమస్యలు
- జీవనశైలి మార్పుతో పాతికేళ్ల నుంచే రుగ్మతలు
- మానవ శరీరంలో కీళ్ల కదలికే ముఖ్యం
- ఉమ్మడి జిల్లాలో పెరుగుతున్న బాధితులు
- నేడు వరల్డ్ ఆర్థరైటిస్ డే

ఇందూరు, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): కీళ్ల అరిగిపోవడాన్ని ఆర్థరైటిస్ అంటారు. మన ప్రతీ కదలికకు కీళ్లే కీలకం. జాయింట్లు మృదువుగా, సజావుగా, సున్నితంగా కదులుతుంటేనే జీవితం హాయిగా, సౌకర్యవంతంగా సాగుతోంది. ఆర్థరైటిస్ అనేది ఒక సాధారణ రుగ్మత. ఇది నొప్పులు, మంట వంటి సమస్యలను కలిగిస్తోంది. కీళ్లపై ప్రభావం చూపుతోంది. సాధారణంగా 65 ఏళ్లు పైబడిన వారిపై ప్రభావం చూపుతోంది. అయితే మారిన జీవనశైలి కారణంగా ప్రస్తుతం 25 ఏళ్లు ఉన్న వారిలో కీళ్ల సమస్య కనిపిస్తోంది. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో ఈ సమస్య అధికం అవుతోంది.

కదలికలే ప్రధానం..

కీళ్లలో ఏదైనా సమస్య తలెత్తినప్పుడు మోకాళ్లు, ఇతర కీళ్లలో విపరీతమైన నొప్పి, వాపు, బిగుసుకుపోవడం, నడవటంలో ఇబ్బంది వంటివి బాధిస్తాయి. మెల్లమెల్లగా వాటి రూపాన్ని కోల్పోవడంతో పాటు కాలు ఆకృతిలో నిర్మాణంలో కూడా తేడా కనిపి స్తోంది. కీళ్ల అరుగుదల బాగా ఎక్కువైన తర్వాత కీళ్ల కదలిక కూడా తగ్గి, కండరాలు పటుత్వం కోల్పోయి వ్యవస్థలో అసమానతలు ఏర్పడతాయి. తగినంత శ్రమ (మిగతా 8వ పేజీలో)

ముందుగా గుర్తిస్తే నియంత్రణ సాధ్యం

- డాక్టర్ మునిదీప్ రెడ్డి, ఆర్థోపెడిక్ సర్జన్, మెడికవర్ ఆస్పత్రి, నిజామాబాద్



మోకాళ్లు, భుజాలు, మణికట్టులు వంటి కీళ్ల నొప్పులు తొలి దశలో గుర్తించి సరైన చికిత్స తీసుకుంటే కీళ్ల దెబ్బతినడాన్ని నివారించవచ్చు. కీళ్ల నొప్పులు వృద్ధాప్యానికి మాత్రమే పరిమితం కాదు. ఆధునిక జీవనశైలిలో వ్యాయామం లోపం, అధిక బరువు, ఒత్తిడి కారణంగా యువతలో కూడా ఆర్థరైటిస్ కేసులు వేగంగా పెరుగుతున్నాయి.




నిరసన తెలుపుతున్న ఆరోగ్యశ్రీ సిబ్బంది

ఉద్యోగాల్లోకి తీసుకోవాలని ఆరోగ్యశ్రీ సిబ్బంది నిరసన

కామారెడ్డి టౌన్, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): తమను తిరిగి ఉద్యోగాల్లోకి తీసుకోవాలని ఆరోగ్యశ్రీ సిబ్బంది, ఆక్సిజన్ ప్లాంట్ ఆపరేటర్లు శనివారం జీజీహెచ్ ఆసుపత్రి ముందు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత మూడు నెలలుగా పెండింగ్‌లో ఉన్న జీతాలు ఇవ్వకపోగా తమను విధులకు రావద్దంటూ సూపరింటెండేంట్ వెంకటేశ్వర్లు హెచ్చరించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇతర జిల్లాలో ఆరోగ్యశ్రీ ఆపరేటర్లను తొలగించలేదని కామారెడ్డిలోనే ఇలా చేయడానికి కారణం ఏంటో అధికారులు చెప్పాల్సిన అవసరం ఉందని అన్నారు. గతంలోనే కలెక్టర్, ఎమ్మెల్యే, ప్రభుత్వ సలహాదారుడిని కలిసి విన్నవించామని తెలిపారు. అయినా తమకు సరైన న్యాయం జరగలేదని తెలిపారు. గత పది సంవత్సరాలుగా విధుల్లో ఉన్న తమకు ఉపాధి లేకుండా పోయిందని వాపోయారు. ఆరోగ్యశ్రీ కింద రూ.10లక్షల వరకు ప్రభుత్వం ఖర్చు చేసే వెసులబాటు కల్పించిన ఇక్కడ కొందరు సిబ్బంది ఇంప్లాంట్‌ల కోసం డబ్బులు తీసుకుంటున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో అమినోద్దీన్, ఇమ్రాన్, గౌతమ్, గంగాధర్, హరి తదితరులు పాల్గొన్నారు.

డీసీసీపై ఫోకస్



- కాంగ్రెస్ అధ్యక్ష ఎంపికకు కసరత్తు
- సంస్థాగత ఎన్నికలపై దృష్టి సారించిన అధిష్ఠానం
- అధ్యక్ష పదవికి ఆశావహుల నుంచి దరఖాస్తుల స్వీకరణ
- దరఖాస్తు చేసుకునేందుకు పలువురు ఆశావహులు
- 13న జిల్లాకు రానున్న పరిశీలకుల బృందం
- నవంబరు మొదటి వారంలో డీసీసీ అధ్యక్షుల జాబితా

కామారెడ్డి, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): అధికార కాంగ్రెస్ పార్టీని సంస్థాగతంగా మరింత బలోపేతం చేయడంపై ఆ పార్టీ అధిష్ఠానం దృష్టి సారించింది. బీసీ రిజర్వేషన్లకు సంబంధించిన జీవో 9, ఎన్నికల నోటిఫికేషన్‌పై హైకోర్టు స్టే ఇవ్వడంతో స్థానిక సంస్థ ల ఎన్నికలు వాయిదా పడిన విషయం తెలిసిందే. ఎన్నికల ప్రక్రియ ఆరు వారాల పాటు నిలిచిపోయి ంది. ఈలోగా ఎప్పటి నుంచో పెండింగ్‌లో ఉన్న జిల్లా కాంగ్రెస్ కమిటీ ఏర్పాటుపై కాంగ్రెస్ ఫోకస్ పెట్టింది. ఈ మేరకు డీసీసీ అధ్యక్ష రేసులో ఉన్న ఆశావహులను జిల్లాల వారీగా ఈనెల 18 వరకు దరఖాస్తులు స్వీకరించనున్నారు. ఇందుకోసం ఢిల్లీ, ఇతర ప్రాంతా ల నుంచి ఏఐసీసీ పరిశీలకులు ఇప్పటికే రాష్ట్రానికి చేరుకున్నారు. వీరంతా జిల్లాలో పర్యటించనున్నారు. ఇప్పుడు డీసీసీ అధ్యక్షుడు సీనియర్ నాయకుడు ప్రజాప్రతినిధుల సమక్షంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో వేదికగా దరఖాస్తులు స్వీకరించనున్నారు.

రేపు జిల్లాకు పరిశీలకులు

జిల్లా కాంగ్రెస్ కమిటీ పదవిపై పలువురు ఆశలు పెంచుకుంటున్నారు. పదవిని ఆశిస్తున్న జిల్లాకు చెందిన కాంగ్రెస్ నేతలు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. డీసీసీ అధ్యక్షుడు ఎంపిక కోసం సోమవారం జిల్లాకు పరిశీలకుల కమిటీ రానుంది. ఏఐసీసీ నుంచి రాజ్‌పాల్‌సింగ్, పీసీసీ నుంచి పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణరావు, కార్పొరేషన్ చైర్మన్ శోభారాణి, పీసీసీ కార్యదర్శి అశోక్‌రెడ్డిలు జిల్లాకు వస్తారు. ఈ కమిటీ సభ్యులు ఆయా నియోజకవర్గాల్లోని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులతో సమావేశమై అందరి అభిప్రాయాలు సేకరిస్తారు. అదేవిధంగా అధ్యక్ష పదవిని ఆశిస్తున్న వారి నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నారు. పరిశీలకుల కమిటీ సేకరించిన వివరాలను పీసీసీ ద్వారా ఏఐసీసీకి అందించనున్నారు.

సమర్థుడైన నేతకే డీసీసీ

సంస్థాగతంగా పార్టీని బలోపేతం చేసేందుకు కాంగ్రెస్ కసరత్తు ప్రారంభించింది. నాయకులు, కార్యకర్తల మధ్య సమన్వ యం కుదిర్చి ఏకాభిప్రాయంతో సమర్థుడైన డీసీసీ అధ్యక్షుడిని నియమించేందుకు పార్టీ అధిష్ఠానం చర్య లు చేపట్టింది. ఇందులో భాగంగా ఏఐసీసీ నుంచే కాకుండా పీసీసీ నుంచి పరిశీలకుల బృందం జిల్లాకు వచ్చి అభిప్రాయసేకరణ చేపట్టి సమగ్రమైన నివేదికను ఏఐసీసీకి అందించనున్నట్లు తెలుస్తోంది. పార్టీ అధికారంలో ఉండడంతో జిల్లాలో డీసీసీ అధ్యక్ష పదవికి పోటీ నెలకొననుంది. పదవి కోసం పలువురు ముఖ్యనేతలు తీవ్రంగానే ప్రయత్నిస్తున్నారు. మరికొందరు అధ్యక్ష పీఠంపై ఆశలు పెట్టుకుంటున్నట్లు తెలుస్తోంది.

అధ్యక్ష పదవి కోసం పోటాపోటీ

జిల్లా కాంగ్రెస్ కమిటీ కొత్త అధ్యక్షున్ని నియమించేందుకు ఆ పార్టీ చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా దరఖాస్తుల ప్రక్రియను ప్రారంభించింది. ఈ నేపథ్యంలో డీసీసీ అధ్యక్ష పదవితో పాటు ఇతర పదవులపై పార్టీ క్యాడర్‌లో పోటీ నెలకొంటుంది. ప్రధానంగా జిల్లా అధ్యక్ష (మిగతా 8వ పేజీలో)



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెంకటరమణరెడ్డి

ఎన్నికలు ఎప్పుడు జరిగినా
కార్యకర్తలు సిద్ధంగా ఉండాలి

కామారెడ్డి టౌన్, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడు జరిగినా కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి అన్నారు. శనివారం కామారెడ్డి జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన నియోజకవర్గ స్థాయి ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. స్థానిక ఎన్నికలు కోర్టు తీర్పు కారణంగా వాయిదా పడినప్పటికీ ఏ క్షణాన అయిన మళ్లీ నోటిఫికేషన్ రావచ్చని ఎప్పుడు ఎన్నికలు వచ్చినా కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని తెలిపారు. నియోజకవర్గంలోని ఎంపీటీసీ, జడ్పీటీసీ, సర్పంచ్ స్థానాలకు ఏ రిజర్వేషన్ వచ్చినా పోటీకి అభ్యర్థులు ఉన్నారని తెలిపారు. గ్రామాల్లో కార్యకర్తల సమావేశం నిర్వహించి పోటీ చేసే అభ్యర్థులను తీర్మానం చేసి ప్రతిపాదించారని తెలిపారు. పోటీ చేసే అభ్యర్థులు, కార్యకర్తలు అందరూ సమన్వయం చేసుకుంటూ గెలుపే లక్ష్యంగా పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు చిన్నరాజులు, జిల్లా ప్రధాన కార్యదర్శి నరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పప్పు ధాన్యాలకు ప్రాధాన్యం ఇవ్వాలి

కామారెడ్డి టౌన్, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): పీఎం ధన్ ధాన్య కృషి యోజన పథకం, పప్పు ధాన్యాల స్వావలంబన మిషన్ ప్రారంభ కార్యక్రమాన్ని శనివారం కేంద్ర ప్రభుత్వ ప్రారంభించింది. ఈ కార్యక్రమాన్ని కామారెడ్డి మండలం చిన్నమల్లారెడ్డి గ్రామంలోని రైతువేదికలో రైతులు వీక్షించారు. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్రమోదీ రైతులను ఉద్దేశించి మనదేశంలో పప్పు ధాన్యాల ఉత్పత్తిని పెంచాలని, ప్రకృతి వ్యవసాయం, వైవిధ్యమైన పంటలను పండించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీఏవో మోహన్‌రెడ్డి, జిల్లా కిసాన్‌సంఘ్ అధ్యక్షుడు విఠల్‌రెడ్డి, జిల్లా కృషి విజ్ఞానకేంద్ర శాస్త్రవేత్తలు అనిల్‌కుమార్, ఆయా మండలాల అధికారులు పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ రాజేష్‌చంద్ర

నకిలీ నోట్ల ముఠా గుట్టురట్టు

- 12 మంది నిందితుల గుర్తింపు
- ఇప్పటికే 8 మంది రిమాండ్
- వివరాలు వెల్లడించిన ఎస్పీ రాజేష్‌చంద్ర

కామారెడ్డి టౌన్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): దొంగనోట్ల తయారీ, చలామణి చేస్తున్న అంతర్రాష్ట్ర దొంగల ముఠాను అరెస్టు చేసినట్లు ఎస్పీ రాజేష్‌చంద్ర తెలిపారు. శనివారం ఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. గత నెల 23వ తేదీన కామారెడ్డిలోని ఓవైన్స్‌లో గుర్తుతెలియని వ్యక్తి రెండు రూ.500ల నోట్లు ఇచ్చి మద్యం కొనుగోలు చేశాడని తెలిపారు. నోట్లను చూసి అనుమానించిన వైన్స్ సిబ్బంది నోట్లు ఇచ్చిన వ్యక్తిని ఈ నోట్లు ఎక్కడివని ప్రశ్నించారు. తనకు సిద్దాగౌడ్ అనే వ్యక్తి జీతం డబ్బులుగా చెల్లించాడని తెలిపి అక్కడి నుంచి వెళ్లిపోయాడు. దీంతో వైన్స్‌లోని క్యాషియర్ మేకల అఖిల్ 24వ తేదీన పట్టణ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడని తెలిపారు. ఆ ఫిర్యాదు ఆధారంగా ఏఎస్పీ చైతన్య రెడ్డి ఆధ్వర్యంలో 8 బృందాలుగా ఏర్పడి దర్యాప్తు ప్రారంభించారని తెలిపారు. 28వ తేదీన రామేశ్వర్‌పల్లి గ్రామానికి చెందిన సిద్ధాగౌడ్‌ను గుర్తించి విచారణ చేయగా అతను సులభంగా డబ్బులు సంపాదించాలని ఆన్‌లైన్‌లో ఫేక్ కరెన్సీ గ్రూపులు చూసి అందులో ఉన్న ఫోన్ నంబర్లకు సంప్రదించాడని తెలిపారు. పశ్చిమబెంగాల్‌కు చెందిన సౌరవ్‌డే అనే వ్యక్తి అందుబాటులోకి వచ్చి ఫేస్‌బుక్‌లో ఫ్రెండ్ రిక్వెస్ట్ పెట్టి సిద్ధాగౌడ్‌ను కాంటాక్ట్ అయ్యాడని తెలిపారు. ఫేక్‌నోట్లు కావాలా అని అడుగగా సిద్దగౌడ్ కావాలని చెప్పడంతో రూ.5 వేలకుగాను రూ.10 వేల నకిలి నోట్లు పంపుతామని ఒప్పందం కుదుర్చుకుని గతనెల 18న కోరియర్ ద్వారా ఇతనికి 18 నకిలీ నోట్లు పంపాడని తెలిపారు. ఆ నోట్ల నుంచి రెండు నోట్లు తీసుకుని వచ్చి స్లోకా వైన్స్‌లో మద్యం కొనుగోలు చేశాడని ఎస్పీ తెలిపారు. సిద్ధాగౌడ్ ఇచ్చిన సమాచారం ఆధారంగా సౌరవ్‌డేను పట్టుకోవడానికి సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ ఆధ్వర్యంలో పశ్చిమ బెంగాల్ వెళ్లి గతనెల 27న పట్టుకుని విచారించగా హరినారాయణభగత్ అనే వ్యక్తితో కలిసి ఫేక్‌నోట్లను బిహార్‌కు చెందిన రషీద్ అనే వ్యక్తి ద్వారా తెప్పించుకుని కస్టమర్లకు ఇస్తున్నాడని తెలిపారు. సౌరవ్‌డేను, హరినారాయణభగత్‌ను అదుపులోకి తీసుకుని కామారెడ్డి కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించామని తెలిపారు. అనంతరం బిహార్‌కు చెందిన రషీద్‌ను పట్టుకునేందుకు సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ ఎస్ రాజులు తమ బృందంతో వెళ్లి సాంకేతిక పరిజ్ఞానంతో రషీద్ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారించగా ఎమ్మెస్సీ కెమిస్ట్రీ చదివిన అతడు కెమికల్ మిక్సింగ్‌పై అవగాహన ఉండడంతో నకిలీ నోట్లను తయారు చేసేందుకు సిద్ధపడినట్లు తెలిపారు. ఇందుకు ఛత్తీస్‌గఢ్‌కు చెందిన నందులాల్ జంగ్‌డే, చట్టరామ్, పశ్చిమబెంగాల్‌కు చెందిన సౌరవ్‌డే, హరినారాయణభగత్, (మిగతా 8వ పేజీలో)

కోతుల బెడద తీరేదెన్నడో?

- గ్రామాల్లో పెరిగిన వానర సంచారం
- ప్రజలపై విచ్చలవిడిగా దాడులు
- నెలల వ్యవధిలో పదుల సంఖ్యలో బాధితులు
- చోద్యం చూస్తున్న అధికారులు




7

నిజాంసాగర్‌లోకి కొనసాగుతున్న వరద


- రెండు వరద గేట్ల ద్వారా నీటి కొనసాగింపు
- ప్రధాన కాలువ వెంట 1200 క్యూసెక్కుల నీటి విడుదల

నిజాంసాగర్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): నిజాంసాగర్ ప్రాజెక్టులోకి వచ్చే వరద నీరు క్రమేపి తగ్గుముఖం పడులునే ఉంది. ఉధృతంగా ప్రవహించిన మంజీరా నది శాంతిస్తూనే ఉంది. శనివారం నాటికి ఎగువ ప్రాంతం నుంచి పదివేల 950 క్యూసెక్కుల వరద నీరు వస్తూనే ఉంది. వీఆర్ నెంబర్ ఐదులోని రెండు గేట్లను కొనసాగిస్తూ 10,950 క్యూసెక్కుల వరద నీటిని మంజీరా నదిలోనికి వదిలివేస్తూ ఉన్నారు. ప్రధాన కాలువ వెంట 1200 క్యూసెక్కుల నీటి విడుదల కొనసాగిస్తూ ఉన్నారు. నిజాంసాగర్ ప్రాజెక్టులో పూర్తిస్థాయి నీటి నిల్వలను నిల్వ ఉంచుతున్నట్లు ప్రాజెక్టు నిర్వహన అధికారి అక్షయ్ కుమార్ తెలిపారు.



కొనసాగుతున్న నిజాంసాగర్ రెండు వరద గేట్లు

ఎన్నికలలే..



- పల్లెల్లో ఆశావహుల ఎదురు చూపులు
- బడా నాయకుల చుట్టూ ప్రదక్షిణలు

బాన్సువాడ రూరల్, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల కోసం ప్రభు త్వం బీసీ రిజర్వేషన్‌లపై జీవోను తీసుకువచ్చి ఆయా ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాలకు రిజర్వేషన్లు ఖరారు చేయడంతో గ్రామాల్లో ఎన్నికల సందడి మొదలైంది. ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కావడంతో ఆశావహుల సందడి ఎక్కువై కొన్ని గంటల్లోనే నోటిఫికేషన్‌పై హైకో ర్టు తీర్పు ఇవ్వడంతో ఆశావహులు స్థానిక సంస్థల ఎన్నికలు కలలేనని ఎన్నికలు ఎప్పుడు వస్తాయోనని ఆశావహులు ఎదురు చూస్తు న్నారు. దీంతో ఎన్నికల్లో పోటీ చేసే ఆశావహులు ఎన్నికలు వాయిదా పడ్డ నాయకుల చుట్టూ వారి ఆశీర్వాదం కోసం తిరుగుతూ ప్రయత్నాలు ఆపడం లేదు.

పార్టీ టికెట్ల కోసం ప్రయత్నిస్తున్న ఆశావహులు

ఆయా రాజకీయ పార్టీల నుంచి పార్టీ టికెట్‌పై జడ్పీటీసీ, ఎంపీటీసీగా పోటీ చేసేందుకు అభ్యర్థులు పోటీ పడుతున్నారు. ప్రజల ఆశీర్వాదం కోసం ఇప్పటి నుంచే కుల సంఘాల నాయకులు, యువజన సంఘాలతో సమావేశాలు నిర్వహించి తమకు అనుకూలంగా ఎన్నికల్లో పని చేయాలని వారి మెప్పు కోసం ప్రయత్నాలు చేస్తున్నారు.

నాయకుల చుట్టూ ప్రదక్షణలు చేస్తున్న ఆశావహులు

బాన్సువాడ నియోకవర్గంలోని ఆయా పార్టీల్లో రెండు, మూడు వర్గాలు ఉండటంతో ఎవరి వర్గం వారు టికెట్లు ఇప్పించుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. కొందరు ఆశావహులు అందరి మెప్పు పొందేందుకు ఒకరికి తెలియకుండా మరొక నాయకుని ఆశీర్వాదం కోసం పార్టీ టికెట్ కోసం విశ్వ ప్రయ త్నాలు చేస్తున్నారు. గ్రామాల్లో సామాజిక వర్గం ఎక్కువ ఉన్న వారందరూ ఐకమత్యంతో తమ సామాజిక వర్గానికి చెందిన వారికే పట్టం కట్టేందుకు క్షేత్రస్థాయిలో పని చేస్తున్నా రు. గ్రామాల్లో యువతకు ప్రాధాన్యం ఇవ్వాల ని గ్రామస్థాయిలో నాయకులు, ఆయా పార్టీల నాయకులకు తమ నాయకులకు అభిప్రాయాలు తెలియజేస్తున్నట్లు సమాచారం.

రాజకీయ రంగులు మార్చే నాయకుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

ప్రస్తుతం గ్రామాల్లో రాజకీయ రంగులు మార్చే నాయకుల పట్ల ప్రజలు స్థానిక సంస్థల ఎన్నికల్లో బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారు. తమ స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం గ్రామాల్లో నాయకుల వద్ద తమదే ఆధిపత్యం సాగుతుందని గ్రామాల్లో ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్న వారిపట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, గ్రామాల్లో యువత గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపించి అవినీతి రహిత పాలన చేసే వారికే పట్టం కట్టాలని బహిరంగంగానే చర్చించకుంటున్నారు. గ్రామాల్లో మద్యం వల్ల కుటుంబాలు చిన్నాభిన్నం అవుతున్నాయని మద్యం నిషేధిత గ్రామాలను తీర్చిదిద్దే వారికే ఎన్నికల్లో ఆశీర్వదించనున్నట్లు మరికొందరు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

క్రైం సమాచారం

చుట్టమని నమ్మించి బంగారం చోరీ



పోలీసుల అదుపులో నిందితుడు బైరయ్య

ధర్పల్లి, అక్టోబరు11(ఆంధ్రజ్యోతి): చుట్టమని నమ్మించి మహిళ దగ్గర కమ్మలను దొంగిలించి పారిపోయిన దొంగను పోలీసులు శనివారం అదుపులోకి తీసుకొని రిమాండ్ చేశారు. వివరాలు.. ఈ నెల 1న ధర్పల్లి పాత బస్టాండ్‌లో గ్రామానికి చెందిన కురి లక్ష్మి బస్సు కోసం ఎదురుచూస్తోంది. ఇంతలో కామారెడ్డికి చెందిన బైరయ్య బైక్‌పై వచ్చి.. లక్ష్మిని చుట్టం పేరుతో నమ్మించి, బంగారు కమ్మలు తీసుకొని పారిపోయాడు. లక్ష్మి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేసింది. దీంతో పోలీసులు శనివారం బైరయ్యను అదుపులోకి తీసుకున్నారు. 2తులాల బంగారాన్ని రికవరీ చేశారు. దొంగను పట్టుకోవడంలో ప్రతిభకనబర్చిన ఎస్సై కళ్యాణి, కానిస్టేబుల్‌ప్రసాద్, హోంగార్డ్ సంతోష్‌ను సీఐ భిక్షపతి అభినందించారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

మెండోర, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): కాకతీయ కాలువలో గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యమైనట్లు ఎస్సై జాదవ్ సుహాసిని తెలిపారు. మృతురాలికి 55-60ఏళ్లు ఉంటాయని, లేత ఆకుపచ్చ చీర, ఎరుపు రంగు జాకెట్ ఉందన్నారు. ఎడమ చేతికి పచ్చబొట్టు ఉందని, చామనాచాయ ముఖం, నలుపు తెలుపు వెంట్రుకలు ఉన్నాయని వివరించారు. వివరాలు తెలిసిన వారు పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

ముప్కాల్, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): బాల్కొండ పోలీస్ స్టేషన్ పరిధిలో అనుమతి లేకుండా నడుస్తున్న రెండు ఇసుక ట్రాక్టర్లను శుక్రవారం రాత్రి పట్టుకుని సీజ్ చేసినట్లు ఎస్సై శైలేందర్ తెలిపారు. స్థానికులు తెలిపిన సమాచారం మేరకు మండల కేంద్రంలో ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను పట్టుకుని డ్రైవర్‌పై, యజమానిపై కేసు నమోదు చేసినట్లు వివరించారు. ప్రభుత్వ అనుమతి లేకుండా అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

చేపల విషయంలో గొడవ.. గాయాలు

బీర్కూర్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కిస్తాపూర్‌లో శుక్రవారం చేపల విషయమై ఇద్దరు వ్యక్తుల మధ్య వాగ్వాదం ఘర్షణకు దారి తీసింది. ఈ ఘటనలో వారికి గాయాలయ్యాయి. గ్రామానికి చెందిన ముగ్గురు శుక్రవారం చేపల వేటకు వెళ్లారు. చేపలు పట్టిన అనంతరం వాటిని అమ్ముకుని వచ్చిన డబ్బులు సమానంగా పంచుకున్నారు. సాయంత్రం ఇద్దరు మళ్లీ వేటకు వెళ్లి చేపలు పట్టుకొచ్చారు. ఒకరు చేపలు అమ్ముదామని అనగా.. మరొకరు ఇంటికి తీసుకెళ్లి వండుకుందామన్నాడు. దీంతో గొడవ జరిగింది. దాడి చేసుకోగా ఇరువురికి గాయాలయ్యాయి. స్థానికులు పోలీసులు, అంబులెన్స్‌కు సమాచారం అందించారు. పోలీసులు అక్కడికి చేరుకుని ఇద్దరిని సముదాయించి గొడవ జరగకుండా చర్యలు తీసుకున్నారు. అంబులెన్స్ సమయానికి రాకపోవడంతో వారిని స్థానికులు ఓ వాహనంలో ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఇద్దరు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.

కూలిన ఇల్లు.. తప్పిన ప్రమాదం

కమ్మర్‌పల్లి, అక్టోబరు11(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని ఊట్పూర్ బాలయ్యకు చెందిన నివాసగృహం శనివారం ఒకపక్క కూలింది. ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. ఇటీవల కురిసిన వర్షాలకు ఇల్లు తడిసి ఉండటంతో ఒక్కసారిగా కుప్పకూలింది.

ఉరేసుకొని యువకుడి ఆత్మహత్య

మోపాల్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సిర్పూర్ గ్రామానికి చెందిన సందీప్ (27) శుక్రవారం రాత్రి ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కాగా ఆత్మహత్యకు గల కారణాలు ఇంకా తెలియరాలేదని పోలీసులు తెలిపారు. భార్యను ఇంట్లో నుంచి పంపించి ఎవరూ లేనిసమయంలో బలవన్మరణానికి పాల్పడినట్లు స్థానికులు తెలిపారు. శనివారం ఉదయం సందీప్ తమ్ముడు చూసి కుటుంబ సభ్యులకు, పోలీసులకు సమాచారాన్ని అందించారు. సందీప్‌కు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు మోపాల్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ముగ్గురు అదృశ్యం

రెంజల్, బోధన్, అక్టోబరు11(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన అభంగపట్నం సావిత్రి అదృశ్యమైనట్లు ఎస్సై చంద్రమోహన్ తెలిపారు. గత నెల 16న సాయంత్రం ఇంటి నుంచి వెళ్లిన సావిత్రి రాత్రి వరకు ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు గాలించారు. చుట్టుపక్కల బంధువుల వద్ద ఆచూకీ కోసం వెతకగా.. ఎలాంటి సమాచారం లభ్యం కాకపోవడంతో భర్త గంగాధర్ పోలీసులకు ఫిర్యాదుచేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

● బోధన్‌కు చెందిన పోశెట్టి(40) శుక్రవారం రాత్రి 9గంటలకు ఇంట్లో నుంచి వెళ్లి తిరిగి రాకపోవడంతో శనివారం కుటుంబీకులు పోలీసులకు ఫిర్యాదుచేశారు. పోశెట్టి మున్సిపాలిటీ ఎలక్ట్రికల్ విభాగంలో విధులు నిర్వహించే వాడన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపడుతున్నట్లు సీఐ వెంకట నారాయణ తెలిపారు.

● బోధన్ మండలం భూలక్ష్మీక్యాంప్‌నకు చెందిన లోకిరెడ్డి సాంబశివారెడ్డి శుక్రవారం నుంచి కనిపించకుండా వెళ్లిపోయాడని అతని భార్య రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేసిందని ఎస్ఐ మచ్చేందర్ రెడ్డి తెలిపారు. కేసునమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నామని తెలిపారు.

వేర్వేరు దొంగతనాల్లో ఆరుగురి రిమాండ్

బోధన్,అక్టోబరు11(ఆంధ్రజ్యోతి): బోధన్ పట్టణంలో జరిగిన వేర్వేరు దొంగతనాల కేసుల్లో శనివారం ఆరుగురిని కోర్టుకు రిమాండ్ చేసినట్లు పట్టణ సీఐ వెంకట నారాయణ తెలిపారు. అంబేద్కర్ చౌరస్తా దగ్గర ఓ ఇంట్లో చోరీచేసిన కేసులో రాజేందర్ సింగ్, సజన్ సింగ్‌లను, బెల్లాల్ కిరాణ షాపులో తలుపు తాళాలను పగులగొట్టి రెండు గ్యాస్ సిలిండర్లను దొంగలించిన రావుల నాగరాజు, ప్రవీణ్, హన్మాండ్లు, బండి తరుణ్‌లను రిమాండ్ చేశామన్నారు. 2 కేసుల్లో సొత్తు రికవరీ చేసినట్లు వివరించారు. కేసు విచారణకు కృషి చేసిన ఎస్ఐ భాస్కర చారి, అబీబ్ ఖాన్‌లను బోధన్ ఏసీపీ శ్రీనివాస్ అభినందించారు.

బామ్మర్ది కోసం నదిలో గాలింపు.. బావ గల్లంతు

మెండోరా, అక్టోబరు11, (ఆంధ్రజ్యోతి): మండలంలో చాకిర్యాల్ గ్రామ శివారు గోదావరి నదిలో ఆర్మూర్ మండలం చేపూరు గ్రామానికి చెందిన కనికరపు గంగన్న గల్లంతు అయ్యాడని ఎస్సై సుహాసిని తెలిపారు.ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం నాలుగు రోజుల క్రితం అదృశ్యమైన చేపూరు గ్రామానికి చెందిన గంగాధర్ ద్విచక్ర వాహనం సోన్ పాత వంతెన వద్ద లభ్యం అయింది.దీంతో గంగాధర్ మిస్సింగ్ కేస్ ఆర్మూర్ పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు కావడంతో ఆర్మూర్ పోలీసులు గంగాధర్ సమీప బంధువులు గోదావరి నదిలో పడి ఉండొచ్చనే అనుమానంతో సోన్ వంతెన నుండి చాకిర్యాల్ శివారు గోదావరి నదిలో వెతుకుతుండగా గంగాధర్ బావ గంగన్న నీటి ప్రవాహానికి గోదావరిలో గల్లంతయ్యాడని తెలిపారు.గాలింపు చర్యలు చేపట్టిన కానీ ఆచూకీ లభ్యం కాలేదు.గల్లంతయిని కుటుంబ సభ్యుల పిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తూ దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

డొంకేశ్వర్, అక్టోబరు11, (ఆంధ్రజ్యోతి): మండలంలోని మారంపల్లి లోని ఓ రేకుల షెడ్డులో శనివారం కొందరు వ్యక్తులు పేకాడుతున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. ఎస్ఐ రామ్ ఆధ్వర్యంలో పోలీసులు పేకాట స్థావరంపై దాడిచేశారు. అదే గ్రామానికి చెందిన నలుగురు, గంగాసరం గ్రామానికి చెందిన ఓ వ్యక్తిని అరెస్టుచేసి వారి నుంచి రూ.5700 స్వాధీనం చేసుకొని, కేసునమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

బడికి పదండి

▸▸ సెలవులు పూర్తయినా పాఠశాలకు రాని విద్యార్థులు ▸▸ వారి కోసం ఇంటి బాట పట్టిన టీచర్లు



విద్యార్థిని బడికి రమ్మని చెబుతున్న హెచ్ఎం కృష్ణచారి, ఉపాధ్యాయులు

ఏర్గట్ల, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు పాఠాలు చెప్పామా.. ఇంటికెళ్లామా.. అనుకునే ఉపాధ్యాయులున్న ఈ రోజుల్లో విద్యార్థులు బడికి రావడానికి వీరు వినూత్న ప్రయత్నాలు చేస్తున్నారు.దసరా సెలవుల్లో వెళ్లి బడికి రాని పిల్లలను తీసుకొచ్చేందుకు ఉపాధ్యాయులే ఇంటి బాట పట్టారు. రెండో శనివారం సెలవు దినం కావడంతో ఏర్గట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యా యుడు కృష్ణచారి ఉపాధ్యాయులతో కలిసి నేరుగా పాఠశాలకు రాని విద్యార్థులకు ఇంటికి వెళ్లారు. తమ పిల్లలను పాఠశాలకు పంపాలని విద్యార్థుల తల్లిదండ్రులను కోరారు. పదో తరగతి ఎంతో విలువైనదని, విద్యార్థులు సమయం వృథా చేయకుండా చదువుకోవాలని ఆయన పేర్కొన్నారు. కొంత మంది విద్యార్థులు పాఠశాలకు రావడం లేదని పలుమార్లు తల్లిదండ్రులకు సమాచారం అందించినప్పటికీ స్పందించకపోవడంతో ఉపాధ్యాయులతో కలిసి ఇంటి బాట పట్టామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయలు నరేష్, కాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆక్రమణలకు పాల్పడితే కేసులు

▸▸ నవీపేట ప్రధాన రహదారికి ఇరువైపులా ఆక్రమణల తొలగింపు

▸▸ నిజామాబాద్ ట్రాఫిక్ ఏసీపీ మస్తాన్ అలీ



నవీపేటలో ఆక్రమణలను తొలగిస్తున్న పోలీసులు

నవీపేట,అక్టోబరు11(ఆంధ్రజ్యోతి): రోడ్డు భద్రతను కల్పించడమే ప్రధాన లక్ష్యమని, ఈ విషయంలో ప్రజలు పోలీసుశాఖకు సహకరించాలని నిజామాబాద్ ట్రాఫిక్ ఏసీపీ మస్తాన్ అలీ అన్నారు. శనివారం మండలకేంద్రంలోని రైల్వే గేటు నుంచి పోలీస్‌స్టేషన్ వరకు ప్రధాన రహదారికి ఇరువైపులా ఆక్రమణలను తొలగించారు. అనంతరం పోలీస్ స్టేషన్‌లో ఆయన మాట్లాడారు. ఆక్రమణలతో పాటు రోడ్డుపైన ఏర్పాటుచేసిన ఫ్లెక్సీలు, జ్యూస్ డబ్బాలు, మిర్చి బండ్లు, దుకాణాల పేర్లతో ఉన్న బోర్డులు, రేకుల షెడ్‌లను తొలగించామని చెప్పారు. మరోసారి రోడ్డు ఆక్రమణలు చేపడితే వారిపై కేసులు నమోదు చేస్తామని ఆయన హెచ్చరించారు. బాసర సరస్వతి దేవి పుణ్యక్షేత్రానికి నిత్యం వందలాది వాహనాలు ఈ మార్గంలో వెళ్తుంటాయని, రోడ్డుపై ప్రయాణం చేసే వాహనదారులు సురక్షితంగా తమ గమ్యాలకు చేరుకోవాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో నిజామాబాద్ నార్త్ రూరల్ సీఐ శ్రీనివాస్, ఎస్సై తిరుపతి, బిరాడ్ ఇన్‌చార్జి వర్ష నిహంత్, జీపీ కార్యదర్శి రవీందర్ ఉన్నారు.

వరి ధాన్యానికి బోనస్ ఇంకెప్పుడు?



ఆందోళనకారులను సముదాయిస్తున్న తహసీల్దార్ గంగాధర్

కోటగిరి,అక్టోబరు11(ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన వరిపంటకు ప్రభుత్వం బోనస్ ఇవ్వకుండా జాప్యం చేస్తుండడంపై రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కోటగిరి మండలంలో బోనస్ విషయమై రైతులు శనివారం ధర్నాకు పిలుపునిచ్చారు. ఉమ్మడి మండలంలోని ఆయా గ్రామాల నుండి పెద్ద రైతులు తహసీల్దార్ కార్యాలయం వద్దకు చేరుకుని పోతంగల్, రుద్రూర్ ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక్కసారి మాత్రమే కంటి తుడుపుగా బోనస్ వేసిందన్నారు. గత సీజన్‌లో సన్న రకం ధాన్యం పండించామని ప్రైవేటుకు అమ్మకుండా కొనుగోలు కేంద్రాల్లో విక్రయించామన్నారు. దానికి సంబంధించి బోనస్ ఇంత వరకు ఇవ్వలేదన్నారు. ప్రస్తుతం ఈ సీజన్ కోతలు ప్రారంభమయ్యాయని బోనస్ విషయమై ప్రభుత్వం స్పష్టమైన హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రస్తుత సీజన్‌లో వర్షాలు అధికంగా కురవడంతో పంట దిగుబడులపై తీవ్ర ప్రభావం చూపిందన్నారు. తమను ఆదుకునేందుకు ప్రభుత్వం తక్షణమే బోనస్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. మరో వైపు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు చేయడం లేదన్నారు. రాస్తారోకో విషయం రెవెన్యూ, పోలీసు అధికారులు ఘటనాస్థలానికి చేరుకున్నారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని తహసీల్దార్ గంగాధర్ హామీ ఇవ్వడంతో రైతులు ధర్నా విరమించారు. కార్యక్రమంలో నవీన్, శ్రీనివాస్ రావు, రవి, మోహన్ రావు, నవీన్, శ్రీనివాస్, దేవేందర్, గంగాప్రసాద్, అరవింద్, ఫారూఖ్ తదితరులు పాల్గొన్నారు.

నష్టపరిహారం చెల్లించాలి



ధర్మాబాద్-నిజామాబాద్ రహదారిపై నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్ నాయకులు

రెంజల్,అక్టోబరు11(ఆంధ్రజ్యోతి): నెల రోజులుగా వరదలతో తీవ్రంగా పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించి, ఆదుకోవాల్సిన ప్రభుత్వం రైతుల వైపు కన్నెత్తి చూసిన పాపాన పోలేదని శనివారం ధర్మాబాద్, నిజామాబాద్ వెళ్లే రహదారిపై బీఆర్ఎస్ నాయకులు రాస్తారోకో చేపట్టారు. రైతే రాజన్న ప్రభుత్వం రైతుల పాలిట శాపంగా తయారైందని మండిపడ్డారు. పంటలు నీట మునిగి నష్టపోయిన రైతులను ఆదుకోవాల్సిన ప్రభుత్వం నేటి వరకు పంట నష్టపరిహారం చెల్లించకపోవడం విడ్డూరమని, తక్షణమే ప్రభుత్వం పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు భూంరెడ్డి డిమాండ్ చేశారు. రైతులను ఆదుకుంటామని చెప్పిన ఎమ్మెల్యే కనీసం కన్నెత్తి చూసిన పోలేదని దుయ్యబట్టారు. పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలని లేనిపక్షంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు కాశం సాయిలు, మొగులనా, ఏకార్, రఫీక్, ఇమామ్ బేగ్, బుజ్జి, గంగాధర్, రాజు, సాయిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ కార్యకర్తలపై కన్నెర్ర చేస్తే ఖబడ్దార్

▸▸ కాంగ్రెస్‌పై బోధన్ మాజీ ఎమ్మెల్యే షకీల్ మండిపాటు



కాంగ్రెస్ బాకీ కార్డులను ప్రదర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే షకీల్

బోధన్,అక్టోబరు11(ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలపై కాంగ్రెస్ కన్నెర్ర చేస్తే ఖబర్దార్ అని, స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడు వచ్చిన బీఆర్ఎస్ పార్టీ సిద్ధంగా ఉందని బోధన్ మాజీ ఎమ్మెల్యే షకీల్ అన్నారు. శనివారం తన స్వగృహంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 22 నెలలు గడిచినా హామీలు అమలు చేయడంలో విఫలమైందన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ బాకీ కార్డులను విడుదల చేస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలకు బాకీ పడిందన్నారు. కాంగ్రెస్ బాకీ కార్డులను గ్రామ గ్రామాన ఇంటింటికి పంపిణీ చేస్తామన్నారు. ఎస్సారెస్పీ గేట్లు ఎత్తకపోవడం వల్లనే బ్యాక్ వాటర్‌తో మంజీర పరివాహక ప్రాంతాల్లోని గ్రామాల్లో పంట నష్టం వాటిల్లిందన్నారు. బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డికి అపార అనుభవం ఉందని కిందిస్థాయి నాయకులు, కార్యకర్తలు ఏమి చేస్తున్నారో చూడాలన్నారు. పథకాల అమలులో కాంగ్రెస్ పక్షపాత ధోరణి అవలంబిస్తుందన్నారు. రైతులకు బాకీ ఉన్న బోనస్‌ను ప్రభుత్వం వెంటనే నిధులు విడుదల చేయాలన్నారు. సమన్వయంతో అన్ని శాఖల అధికారులతో ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి నష్టం వాటిల్లిన పంటలను పరిశీలించి నష్టపోయిన రైతులకు నష్టపరిహారం అందించేలా చూడాలన్నారు. ప్రజల సమస్యలపై దృష్టి పెట్టి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. వారంలో రెండు రోజులైన బోధన్‌లో ప్రజలకు అందుబాటులో ఉండాలని పేర్కొన్నారు. బీఆర్ఎస్ కార్యకర్తలను బెదిరించడం, కేసులు పెట్టడం జరుగుతుందని, వీటిని ఎమ్మెల్యే గమనించి అరికట్టాలన్నారు. కార్యక్రమంలో నవీపేట, బోధన్, ఎడపల్లి మండల అధ్యక్షులు నర్సింగ్ రావు, సంజీవ్ కుమార్, శ్రీరాం, నాయకులు శ్రీనివాస్, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైభవంగా పల్లకీసేవ



పూజలు చేస్తున్న భక్తులు

జక్రాన్‌పల్లి, అక్టోబరు11(ఆంధ్రజ్యోతి): తొర్లికొండలో శనివారం వేంకటేశ్వర స్వామి దేవాలయం ఉత్సవాలను భక్తులు, గ్రామస్థులు భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు.. తెల్లవారుజాము నుంచే భక్తులు కొండపైకి చేరుకున్నారు. అనంతరం స్వామివారి పల్లకీని కొండ చుట్టూ ఊరేగించారు. ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. భక్తుల కోసం అన్నదానం చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ సంజీవ్‌గౌడ్, బ్రాహ్మణ్‌పల్లి సొసైటీ చైర్మన్ కాటిపల్లి నర్సారెడ్డి, భక్తులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

చోరీకి గురైన ఫోన్‌ల అప్పగింత

కమ్మర్‌పల్లి, సెప్టెంబరు, 11: (ఆంధ్రజ్యోతి) మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన వ్యక్తుల నుంచి చోరీకి గురైన రెండు సెల్‌ఫోన్‌లను శనివారం కమ్మర్‌పల్లి ఎస్ఐ అనిల్ రెడ్డి వాటి యాజమానులకు అప్పగించారు. సెల్‌ఫోన్ పోయిందనే బాధితుల ఫిర్యాదు మేరకు సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ట్రాక్‌చేసి బాధితులకు అప్పగించినట్లు ఎస్ఐ చెప్పారు. ఈ సందర్భంగా సెల్‌ఫోన్ రికవరీలో సహకరించిన మహిళా కానిస్టేబుల్ జి.వసుధాను ఎస్ఐ అనిల్ అభినందించారు.

బకాయిలు విడుదల చేయాలి

బోధన్,అక్టోబరు11(ఆంధ్రజ్యోతి): బెస్ట్ అవెలెబుల్ స్కీం బకాయిలను విడుదల చేయాలని బోధన్ విద్యార్థి జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం బోధన్ పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. ప్రైవేటు విద్యాసంస్థల్లో ఎస్సీ, ఎస్టీ పేద విద్యార్థులు విద్యనభ్యసించేందుకు బెస్ట్ అవెలెబుల్ స్కీంను ప్రభుత్వం గతంలో తీసుకువచ్చిందన్నారు. ఈ పథకం కింద హాస్టల్ విద్యార్థులకు ప్రభుత్వం ద్వారా రావాల్సిన బకాయిలను చెల్లించాలన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్య మూలంగా పేద విద్యార్థులు విద్యకు దూరమవుతున్నారన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి అవెలెబుల్ స్కీం కింద బకాయిలను విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘాల జేఏసీ చైర్మన్ నాగరాజు, జేఏసీ కన్వీనర్ గౌతంకుమార్‌లతో పాల్గొన్నారు.

అరుణ్ కుమార్‌పై చర్యలు తీసుకోవాలి

బోధన్, అక్టోబరు11,(ఆంధ్రజ్యోతి): తుడుం దెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు మైపాతి అరుణ్ కుమార్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని గిరిజన విద్యార్థి సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శనివారం బోధన్ ఏసీపీ శ్రీనివాస్‌కు వినతి పత్రం అందించారు. సంఘం జిల్లా అధ్యక్షులు ప్రవీణ్ నాయక్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో కొంతకాలంగా రిజర్వేషన్ల కోసం లంబాడీ, కోయా, గోండ్‌ల మధ్య జరుగుతున్న వివాదంలో భాగంగా లంబాడ జాతిని కించపరిచేలా అరుణ్ అనుచిత వ్యాఖ్యలు చేశారని వెంటనే తగిన చర్యలు చేపట్టాలని కోరారు. సంఘం నాయకులు బన్నీ నాయక్, నరేష్ నాయక్, శ్రీనివాస్ నాయక్, రమేష్ నాయక్ పాల్గొన్నారు.

ఎస్సారెస్పీ గేట్ల మూసివేత

మెండోర , అక్టోబరు 11, (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి వరద తగ్గుముఖం పట్టడంతో ప్రాజెక్టు వరద గేట్లను మూసివేసి ప్రధాన కాలువల ద్వారా నీటిని విడుదల చేస్తున్నట్లు ఈఈ చక్రపాణి తెలిపారు. ప్రాజెక్టు ఎగువ ప్రాంతాల్లో వర్షాలు తగ్గుముఖం పట్టడంతో ప్రాజెక్టులోకి వరద తగ్గిందని అన్నారు. శనివారం ఉదయం ప్రాజెక్టులోకి 10వేల క్యూసెక్కుల వరద నీరు చేరుతుండటంతో వరద గేట్లను మూసివేసి ప్రాజెక్టు ప్రధాన కాలువలకు నీటి విడుదల చేశామన్నారు. కాకతీయ కాలువకు 5000 క్యూసెక్కులు, ఎస్కేప్ గేట్ల నుంచి 3000 క్యూసెక్కులు, లక్ష్మీ కాలువకు 200 క్యూసెక్కులు, సరస్వతి కాలువకు 650 క్యూసెక్కుల నీటి విడుదల కొనసాగుతుందన్నారు. పూర్తిస్థాయి నీటిమట్టం 1091.00 అడుగులు, 80.5 టీఎంసీలు కాగా శనివారం సాయంత్రానికి ప్రాజెక్టు 1090 అడుగుల 80 టీఎంసీల వరద నీరు చేరిందన్నారు. 795 టీఎంసీల మిగులు జలాలను గోదావరిలోకి విడుదల చేశామన్నారు.

ప్లాస్టిక్ వస్తువులను వాడొద్దు



దుకాణాదారులకు చేతి సంచులను అందజేస్తున్న విద్యార్థులు

బోధన్, అక్టోబరు11, (ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ వస్తువులను నిషేధించి పర్యావరణాన్ని కాపాడాలని నినదిస్తూ బోధన్ పట్టణంలోని ఇందూర్ మోడల్ స్కూల్ విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని వ్యాపారులకు అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ కిషోర్ మాట్లాడుతూ.. ప్లాస్టిక్ వాడకాన్ని నివారించి, పర్యావరణానికి హాని చేయని వస్తువుల వాడకంపై అవగాహన కోసం ర్యాలీ నిర్వహించడం జరిగిందన్నారు. తెలంగాణ నేషన్ గ్రీన్ కార్ప్ ఆధ్వర్యంలో పర్యావరణ విద్య కార్యక్రమంలో భాగంగా పాఠశాలలో ఎకోక్లబ్‌ను ఏర్పాటు చేసి ఈ కార్యక్రమం నిర్వహించామని తెలిపారు. పాత వస్త్రాలైన జీన్స్, ఇతర ప్యాంట్లు, చీరలను, దుప్పట్లను తదితర పాత వస్త్రాలను ఉపయోగించి చేతి సంచులను విద్యార్థులు తయారు చేశారన్నారు. 200సంచులను విద్యార్థులు తయారు చేయగా ఆ సంచులను పట్టణంలోని పలువురు వ్యాపారులకు ఇచ్చామన్నారు. పర్యావరణ విద్య ఏకో క్లబ్ కన్వీనర్ స్వాతి జెండా ఊపి ప్రారంభించగా ర్యాలీ ఆచన్‌పల్లితో పాటు పట్టణంలోని ప్రధాన వీధుల గుండా సాగింది. ప్రధానోపాధ్యాయులు రామారావు, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

సోయా పంటను తక్షణమే కొనాలి

కోటగిరి,అక్టోబరు11(ఆంధ్రజ్యోతి): పోతంగల్ మండలంలోని సుంకిని గ్రామానికి చెందిన రైతులు సోయా కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు పోతంగల్ విశాల పరపతి సంఘం కార్యాలయంలో శనివారం విండో కార్యదర్శి శివాజీకి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. భారీ వర్షాల వల్ల సోయాపంటకు తీవ్ర నష్టం వాటిల్లిందన్నారు. తక్షణమే కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసి పంటను కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతులు నాగనాథ్, మాధవరావు, లక్ష్మణ్, రమేష్, నగేష్, సచిన్, లక్ష్మణ్, శంకర్, రాజేందర్ పాల్గొన్నారు.

బీడీ పరిశ్రమపై కేంద్రం కుట్రలు

బోధన్, అక్టోబరు11(ఆంధ్రజ్యోతి): బీడీ మార్కెట్‌ను ఎంఎన్‌సీలకు అప్పజెప్పే కుట్రలను కేంద్రప్రభుత్వం చేస్తుందని ప్రగతి శీల బీడీ వర్కర్స్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు మల్లేష్ అన్నారు. శనివారం బోధన్‌లోని బీడీ కార్ఖానాలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశవ్యాప్తంగా బీడీ పరిశ్రమపై కోటిన్నర మంది ఆధారపడి జీవిస్తున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం బీడీ మార్కెట్‌ను మల్టీనేషనల్ కంపెనీలకు అప్పజెప్పే పెద్ద కుట్ర చేస్తుందని ఆయన ఆరోపించారు. బీడీ మార్కెట్‌ను బడా కార్పొరేట్ శక్తులకు అప్పజెప్పే ప్రయత్నాలు చేస్తుందని ఇది సరైన చర్య కాదని తీవ్రంగా విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే బడా కార్పొరేట్‌లకు అప్పజెప్పే విధానాలను ఉపసంహరించుకోవాలని, బీడీ కార్మికులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీడీ కార్మిక నాయకులు రాములు, కవిత, రూప, అనిత, నాగరాణి, సావిత్రి, సురేఖ, భాగ్యలక్ష్మి, భానుబీ, శశిరేఖ, అలేఖ్య, జ్యోతి ఉన్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం

వేల్పూర్, ముప్కాల్, అక్టోబరు 11, (ఆంధ్రజ్యోతి): వేల్పూర్‌కు చెందిన ఆర్టీసీ డ్రైవర్ శ్యాంసుందర్ ఇటీవల అనారోగ్యంతో మరణించాడు. ఈ విషయం తెలుసుకున్న తోటి విద్యార్థులు శనివారం బాధిత కుటుంబ సభ్యుని ఇంటికి వెళ్లి ఆర్థికసాయంతో పాటు రెండు నెలలకు సరిపడా వంట సామాగ్రిని అందించారు. మున్ముందు కూడా తాము శ్యాంసుందర్ కుటుంబానికి అండగా ఉంటామన్నారు. ఉద్యోగులు బి.రాజరావ్, బి. రమణయ్య, విజయరావు, ఇతర ఉద్యోగులు తదితరులు ఉన్నారు.

● ముప్కాల్ మండలం రెంజర్లకు చెందిన వడ్ల రాములు అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జి ముత్యాల సునీల్‌కుమార్ తన అనుచరుల ద్వారా బాధిత కుటుంబ సభ్యులకు రూ. 5వేలు ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ఏర్పాటుచేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న బి.దేవరాం

ఆర్మూర్ టౌన్, అక్టోబరు 11, (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను తక్షణమే ఏర్పాటు చేయాలని ఏఐయూకేఎస్ రాష్ట్ర కార్యదర్శి దేవరాం అన్నారు. శనివారం పట్టణంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గత ఎన్నికల్లో రేవంత్‌రెడ్డి వరంగల్ డిక్లరేషన్ పేరుతో రైతాంగానికి హామీలను ఇచ్చి ఏ ఒక్క హామీని పూర్తిచేయలేదని ఆరోపించారు. పంట చేతికొచ్చి నెల రోజులవుతున్నా కొనుగోలు కేంద్రాలు ఏర్పాట చేయకపోవడం సీఎం చిత్తశుద్ధి అర్థమవుతుందని అన్నారు. రైతులకు రూ.2లక్షల రుణమాఫీ చేయలేదని, బకాయిలో ఉన్నవారందరికీ మాఫీ చేయాలని రైతు భరోసా కల్పించడంలో పూర్తిగా వైఫల్యం చెందారని అన్నారు. రైతు వ్యతిరేక పద్దతులు మార్చుకోకపోతే స్థానిక సంస్థల ఎన్నికల్లో తగిన గుణపాఠం చెబుతారని తెలిపారు. ఏఐయూకేఎస్ జిల్లా అధ్యక్షుడు సురేష్, కార్యదర్శి కిషన్, యూ. రాజన్న, ఆకుల గంగారాం తదితరులు పాల్గొన్నారు.



నిజాంసాగర్ ప్రాజెక్టును సందర్శించిన ఉస్మానియా యూనివర్సిటీ కళాశాల విద్యార్థులు

నిజాంసాగర్ ప్రాజెక్టుపై
ఓయూ విద్యార్థుల అధ్యయనం

నిజాంసాగర్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): ఉస్మానియా యూనివర్సిటీలో సివిల్ ఇంజనీరింగ్ డిపార్టుమెంట్ విద్యాభ్యాసం చేస్తున్న విద్యార్థులు శనివారం నిజాంసాగర్ ప్రాజెక్టును సందర్శించారు. ప్రాజెక్టు నిర్మాణం నీటి నిల్వలు ఆయకట్టుపై విద్యార్థులు అధ్యయనం చేసుకున్నారు. తెలంగాణ జిల్లాలో మొట్టమొదటి నిజాంసాగర్ ప్రాజెక్టు కట్టడాన్ని చూసి సివిల్ ఇంజనీరింగ్ విద్యార్థులు అవాక్కయ్యారు. నిజాంసాగర్ నిర్మాణ చరిత్రను నీటి పారుదల శాఖ అధికారులు వారికి వివరించారు. వీరి వెంట ప్రొఫెసర్‌లు కేఎల్ రాధిక, రాజశేఖర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ అజయ్ కుమార్, ప్రాజెక్టు డిప్యూటీ ఈఈ ప్రవీణ్ కుమార్, నిర్వాణాధికారి అక్షయ్ కుమార్‌లు ఉన్నారు.

బాన్సువాడలో ఆర్‌ఎస్‌ఎస్ పద సంచలన్

బాన్సువాడ టౌన్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): బాన్సువాడ పట్టణంలో శనివారం మధ్యాహ్నం ఆర్‌ఎస్‌ఎస్ పథ సంచలన్ నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో స్వయం సేవక్‌లు విచ్చేశారు. సంఘే శక్తి.. కలోయుగే నినాదంతో బస్టాండ్, పాత బాన్సువాడ, ప్రధాన రహదారి గుండా పద సంచలన్ సాగింది. క్రమశిక్షణ, దేశభక్తితో స్వయం సేవక్‌లు ముందుకుసాగారు. దారిపొడవునా భారత్ మాతాకీ జై నినాదాలతో బాన్సువాడ దద్దరిల్లింది. ఒకే గమ్యం వైపునకు వేలాదిమంది అడుగులు వేశారు. బాన్సువాడలో ఆర్‌ఎస్‌ఎస్ చారిత్రక పద పంచలన్ నిర్వహించారనే చర్చలు సాగాయి.



ఆర్‌ఎస్‌ఎస్ పద సంచలన్‌లో పాల్గొన్న స్వయం సేవక్‌లు

డ్రైనేజీ కాల్వలను పరిశీలించిన
ఆగ్రోస్ చైర్మన్ కాసుల

బాన్సువాడ టౌన్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో డ్రైనేజీ కాల్వలు, సీసీ రోడ్డు నిర్మాణాలకు గాను రూ.15కోట్ల నిధులు మంజూరయ్యాయి. ఈ మేరకు చేపట్టబోయే పనులను శనివారం రాష్ట్ర ఆగ్రోస్ చైర్మెన్ కాసుల బాల్‌రాజ్ నాయకులతో కలిసి పరిశీలించారు. ఆయనతో పాటు మాజీ మున్సిపల్ చైర్మెన్ జంగం గంగాధర్, ఎజాస్, నార్ల సురేష్ , దాసరి శ్రీనివాస్ తదితరులున్నారు.



డ్రైనేజీ కాల్వలను పరిశీలిస్తున్న ఆగ్రోస్ చైర్మెన్ కాసుల

స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగురవేయాలి

పెద్దకొడప్‌గల్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): రానున్న రోజుల్లో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో నియోజక వర్గంలోని అన్ని గ్రామాల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించుకునేలా నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావ్ సూచించారు. శనివారం క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గంలోని ముఖ్య కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో సమీక్ష స మావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తోట మాట్లాడుతూ స్థానిక సంస్థలు ఎన్నికలు జరగనున్న దృష్ట్యా ప్రతి గ్రామంలో నాయకులు సమన్వయంతో పని చేయాలన్నారు. పార్టీ కోసం కష్టపడే వారిని గుర్తిస్తామని వారికి న్యాయం జరిగేలా చూస్తా మని తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లి, ప్రతి పక్షాల విమర్శలను తిప్పికొట్టాలని సూచించారు. అంతా కలిసి కట్టుగా పనిచేసి పార్టీ జెండాను ఎగురవేసే దిశగా కృషి చేయాలని సూచించారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చిన నాయకులు, కార్యకర్తలు సిద్ధంగా ఉండాలన్నారు. బీసీలకు ప్రభుత్వం 42 శాతం రిజర్వేషన్లు అమలు చేసేందుకు సిద్దంగా ఉందన్నారు. నియోజకవర్గంలో 20 నెలల్లో సుమారుగా 9 కోట్ల విలువైన ఎల్వోసీలు మంజూరు చేశామని, పేదల ఆరోగ్యం సంక్షేమం పట్ల ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు పిట్లం మార్కెట్ కమిటీ చైర్మన్ మనోజ్, విఠల్ రెడ్డి, వెంకట్ రెడ్డి, దర్పల్ గంగాధర్, గోపాల్ రెడ్డి, నాగిరెడ్డి, శీను పటేల్, నాగ్‌నాథ్‌పటేల్, గంగూనాయక్, చిప్ప మోహన్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తోట

వీడియో కాన్ఫరెన్స్‌ను
వీక్షించిన కాంగ్రెస్ నాయకులు



వీడియో కాన్ఫరెన్స్‌ను వీక్షిస్తున్న బీజేపీ నాయకులు

పెద్దకొడప్‌గల్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమం కోసం దేశ రాజధాని ఢిల్లీలో ప్రధాని నరేంద్ర మోదీ ప్రధానమంత్రి ధన్- ధాన్య కృషి యోజన పథకాన్ని వర్చువల్‌గా ప్రారంభించడంతో పెద్ద కొడప్‌గల్ మండల బీజేపీ నాయకులు కార్యక్రమాన్ని వీక్షించారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ దేశంలో గల రైతు సోదరుల ప్రయో జనార్థం ప్రధాన మంత్రి మోదీ 42 వేల కోట్లకు పైగా విలువైన ప్రాజెక్ట్ పనులను ప్రారంభించడం జరిగిందని తెలిపారు. ఈ పథకాల ద్వారా దేశంలో గల అనేకమంది పప్పు ధాన్యాల, మత్స్య, పశు సంవర్ధక, ఫుడ్ ప్రాసెసింగ్ రంగాల వాటి వారికి ప్రయోజనం కలుగుతుందని తెలిపారు. రైతుల సంక్షేమమే పరమావధిగా మోదీ ప్రభుత్వం పని చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఈవో సందీప్, రైతు నాయకులు తానాజీ, కృష్ణ జ్యోషి, కుమార్‌సింగ్, బోడి రాజు, చిప్ప రమేష్, జైత్రాం, నవీన్ గౌడ్, హ న్మాండ్లు తదితరులు పాల్గొన్నారు.

ధన్ ధాన్య కృషి యోజనపై అవగాహన



ప్రధానమంత్రి ధన్ ధాన్య కార్యక్రమాన్ని వీక్షించిన మార్కెట్ కమిటీ చైర్మన్ రజితారెడ్డి

ఎల్లారెడ్డి, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ శనివారం ధన్ ధాన్య పప్పు ధాన్యాల స్వావలంబన మిషన్ రైతులకు 42 వేల కోట్లకు పైగా విలువైన వ్యవసాయ ప్రాజెక్టులను నేషనల్ అగ్రికల్చర్ సైన్స్ కాంప్లెక్స్ న్యూఢిల్లీలోని పూస నుంచి ప్రారంభించారు. అదే విధంగా వ్యవసాయ మౌలిక సదుపాయాల నిధి, పశుసంవర్ధక, మత్స్య, ఆహార ప్రాసెసింగ్ రంగానికి చెందిన పదకొండు వందలకు పైగా ప్రాజెక్టుల ప్రారంభోత్సవం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమాన్ని ఎల్లారెడ్డి మార్కెట్ కమిటీ కార్యాలయంలో చైర్‌పర్సన్ మారెడ్డి రజిత రెడ్డి పాలకవర్గ సభ్యులు రైతులతో కలిసి వీక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ చైర్మన్ వెంకట్ రామ్‌రెడ్డి, డైరెక్టర్లు నాగం శంకరయ్య, రవీందర్ రెడ్డి, గంగా రెడ్డి కార్యదర్శి శ్రీనివాస్, సిబ్బంది శశికాంత్ పాల్గొన్నారు.

బీర్కూర్: బీర్కూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో ఏఎంసీ చైర్మెన్ దుర్గం శ్యామలతో పాటు పాలకవర్గ సభ్యులు టీవీలలో ప్రధాని ప్రసంగాన్ని వీక్షించారు. దీపావళికి పండుగకు ముందు ప్రధాని నరేంద్ర మోదీ రైతులకు భారీ కానుక ఇచ్చారు. ఢిల్లీలోని పూసాలోని ఇండియన్ అగ్రికల్చరల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ నుంచి రూ.42 వేల కోట్ల విలువైన పథకాలను ప్రధాని మోదీ ప్రారంభించారు. రైతులకు పెద్ద బహుమతిని ఇస్తూ, ప్రధాని మోదీ రూ. 24 వేల కోట్ల విలువైన ప్రధాన మంత్రి ధన్‌ధాన్య కృషి యోజన పథకంతో పాటు రూ. 11,440 కోట్ల విలువైన పప్పు ధాన్యాల ఉత్పాదకత మిషన్‌ను ప్రా రంభించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మెన్ దుర్గం శ్యామల, వైస్ చైర్మన్ రాములు, పాలకవర్గ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

సాలూరలో ఉచిత కంటి వైద్య శిబిరం

సాలూర, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): సాలూర మండల కేంద్రంలో లయన్స్ క్లబ్ ఆఫ్ బోధన్ అయ్యప్ప సేవా బోధన్ లయన్స్ ప్రతినిధుల ఆధ్వర్యంలో శనివారం ఉచిత వైద్య నిపుణులు గ్రామస్థులకు కంటి పరీక్షలను చేశారు. కంటి సమస్యలు ఉన్న వారికి మందులను ఉచితంగా అందజేశారు. కంటి జబ్బులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కంటి సమస్యలు నిర్ధారణ అయిన వారికి ఆపరేషన్ మరియు మెరుగైన చికిత్స కోసం సిఫారసు చేశారు. సాలూర ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది గ్రామస్థులకు షుగర్ పరీక్షలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిస్ట్రిక్ ఐ క్యాంప్ చైర్మన్ లయన్ సురాబత్తిని శ్రీనివాస్ రావు, గోవింద్ రెడ్డి, ఇంద్ర గౌడ్, ఐ క్యాంప్ ప్రోగ్రాం ఇన్‌చార్జి హన్మంతరావు, కంటి వైద్య నిపుణులు, హెల్త్ సూపర్‌వైజర్ సాయి కుమారి, సిబ్బంది రంషా రబియా, ఆశా వర్కర్లు నాగలత, సుజాత,, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

జోనల్‌స్థాయి క్రీడాకారుల ఎంపిక

కమ్మర్‌పల్లి, వేల్పూర్, భీమ్‌గల్, ఆలూర్, ముప్కాల్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): కమ్మర్‌పల్లి మండలంలోని చౌట్‌పల్లి ఉన్నత పాఠశాలలో శనివారం కమర్‌పల్లి, ఏర్గట్ల, మోర్తాడ్ మండలలాలకు చెందిన జోనల్ స్థాయి వాలీబాల్, కబడ్డీ క్రీడాకారుల ఎంపికలు నిర్వహించారు. ఎంఈవో ఆంధ్రయ్య ముఖ్యఅతిథిగా హాజరై క్రీడలను ప్రారంభించారు. కబడ్డీ, వాలీబాల్ క్రీడల్లో అసమాన క్రీడా ప్రతిభ కనబర్చిన పలువురిని జోనల్ స్థాయికి ఎంపిక చేశారు. వీరు జిల్లాకేంద్రంలో జరిగే పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. వ్యాయమ ఉపాధ్యాయులు నాగభూషణం, నగేష్, శ్యామ్, ప్రేమ్, ఆనంద్, రమేష్ గౌడ్, మాధురి, జ్యోతి, స్వప్న, బాలు, సంజీవ్, ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, బంతిలాల్ పాల్గొన్నారు.

● వేల్పూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం రాజన్న ఆధ్వర్యంలో భీమ్‌గల్ రూరల్ జోనల్ స్థాయి క్రీడాకారుల ఎంపిక నిర్వహించారు. వాలీబాల్ అండర్- 17 విభాగంలో కబడ్డీ అండర్ -14 విభాగంలో బాలురు, బాలికల జట్లను ఎంపిక చేశారు. ఇటీవల మండల స్థాయి క్రీడల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు పొందిన ఆయా పాఠశాలల నుంచి నలుగురు చొప్పున క్రీడాకారులు ఈ ఎంపికల్లో పాల్గొన్నారు. పీడీ రాజేందర్, వివిధ పాఠశాలల వ్యాయమ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● భీమ్‌గల్‌లోని కృషి హైస్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా భీమ్‌గల్ అర్బన్ జోన్ లెవెల్ క్రీడాకారుల ఎంపికను శనివారం చేపట్టారు. అండర్-14, 17 కబడ్డీ, వాలీబాల్ విభాగంలో బాల, బాలికలు పాల్గొన్నారు. ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను భీమ్‌గల్ అర్బన్ జోన్‌కి ఎంపిక చేశారు. ఎంపికైన వారు ఈ నెల 13న జిల్లా కేంద్రంలోని డీఎస్‌పీ గ్రౌండ్‌లో జరిగే జిల్లాస్థాయి పోటీలలో పాల్గొననున్నారని కబడ్డీ అర్బన్ జోన్ ఆర్గనైజ్ సెక్రటరీ సదమస్తుల రమణ తెలిపారు. ఎంఈవో స్వామి, కృషి స్కూల్ యాజమాన్యం పాల్గొన్నారు.

● ఆలూర్ జడ్పీహెచ్‌ఎస్ పాఠశాల ఆవరణలో ఆలూర్, నందిపేట్, డొంకేశ్వర్ మండలాల జోనల్ సెలక్షన్స్ కబడ్డీ సబ్ జూనియర్ బాల బాలికల విభాగంలో వాలీబాల్, జూనియర్ బాల బాలికల విభాగంలో జోనల్ సెలక్షన్స్ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఆలూర్ నరేందర్ హాజరయ్యారు.

● ఈ నెల 13 నుంచి నిర్వహించనున్న జిల్లా స్థాయి అండర్ -17 బాలబాలికల వాలీబాల్ పోటీలకు బాల్కొండ జోనల్ జట్టును ఎంపిక చేసినట్లు జడ్పీహెచ్‌ఎస్ కన్వీనర్ రాజేశ్వర్ రెడ్డి శనివారం తెలిపారు. కార్యక్రమంలో ఇంచార్జి సురేందర్, ఉపాధ్యాయ బృందం రాజ్‌కుమార్, వివిధ పాఠశాలల పీడీలు పాల్గొన్నారు.



కమ్మర్‌పల్లిలో ఎంపికైన క్రీడాకారులతో పీడీలు



వేల్పూర్‌లో క్రీడాకారులకు సూచనలిస్తున్న హెచ్‌ఎం రాజన్న

పక్కాగా పంటల సాగు లెక్క

- నెల రోజులుగా క్షేత్రస్థాయిలో వ్యవసాయ అధికారుల సర్వే
- ప్రత్యేక యాప్‌లో వివరాల నమోదు

మద్నూర్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) : వానాకాలం సీజన్‌లో రైతులు సాగు చేసిన పంటల వివరాలను పక్కాగా నమోదు చేసేందుకు వ్యవసాయ శాఖ అధికారులు చర్యలు చేపట్టారు. డిజిటల్ సర్వేలో భాగంగా రైతుల నుంచి వివరాలు సేకరించేందుకు వ్యవసాయ విస్తరణ అధికారులు నెల రోజులుగా గ్రామాల్లో పర్యటిస్తున్నారు. రైతులు సాగుచేసిన పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించి ప్రత్యేక యాప్‌లో నమోదు చేస్తున్నారు. తద్వారా రైతులు పంట దిగుబడులను విక్రయించుకోవడం సులభతరం అవుతుందని అధికారులు చెబుతున్నారు.

● 42 రెవెన్యూ గ్రామాల్లో సర్వే

ఉమ్మడి మద్నూర్ మండలంలోని 42 రెవెన్యూ గ్రామాల పరిధిలో గత నెల రోజుల నుంచి వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పంటల సర్వే చేస్తున్నారు. గత ప్రభుత్వ హాయంలో ముందుగా గ్రామాల వారీగా సాగైన పంటల వివరాలను సేకరించి, ఆ తర్వాత యాప్‌లో నమోదు చేసేవారు. ప్రస్తుతం అందుకు భిన్నంగా ఏఈఓలు క్షేత్రస్థాయిలో పర్యటించి పంటల సాగు విస్తీర్ణాన్ని పరిశీలించి అప్పటికప్పుడు యాప్‌లో నమోదు చేస్తున్నారు.

● పూర్తి వివరాల సేకరణ

డిజిటల్ సర్వేలో భాగంగా క్లస్టర్ వారీగా ఏఈవోలకు కేటాయించిన గ్రామాల్లో రైతు పేరు, సర్వే నెంబరు, బ్యాంకు ఖాతా, పట్టాదారు పాస్ పుస్తకం, ఫోన్ నెంబర్‌తో పాటు సాగు చేసిన పంటలు వివరాలను యాప్‌లో నమోదు చేస్తారు. ఉమ్మడి మద్నూర్ మండలంలో 24 వేల మంది రైతులు 42 వేల ఎకరాలలో వివిధ పంటలు సాగు చేశారు. అందులో ఇప్పటివరకు 18 వేల మంది రైతులకు సంబంధించిన 32 వేల ఎకరాల సాగు చేసిన పంటల వివరాలను నమోదు చేసినట్లు మండల వ్యవసాయ అధికారి రాజు తెలిపారు. ఈ నెల చివరి వరకు ఉమ్మడి మద్నూర్ మండలంలో పంటల సాగు లెక్క పక్కాగా వస్తుందని పేర్కొన్నారు.



మద్నూర్ మండలంలో పంటల సాగు వివరాలు నమోదు చేస్తున్న వ్యవసాయ అధికారులు సిబ్బంది

● క్షేత్రస్థాయిలో పరిశీలించి నమోదు

రైతులు సాగు చేసిన పంటల వివరాలను గ్రామాల వారిగా క్షేత్రస్థాయిలో పరిశీలించి వ్యాపులో నమోదు చేస్తున్నాం. సాగు వివరాల నమోదుతో రైతులు పంట దిగుబడులను విక్రయించుకునేందుకు, పంటలు దెబ్బతిన్నప్పుడు పరిహారం అందించేందుకు ఉపయోగకరంగా ఉంటుంది.

- అనిల్, ఏఈవో

● పంటల సాగు నమోదు చేయించుకోవాలి

వ్యవసాయ అధికారి రాజురైతులు తాము సాగు చేసిన పంటల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయించుకోవాలి. సాగు వివరాలను మూడేళ్ల వరుసగా నమోదు చేయించుకోకపోతే రైతు భరోసా అందదు. క్షేత్రస్థాయిలో పర్యటించి వివరాలను డిజిటల్ యాప్‌లో నమోదు చేస్తున్నారు.

- రాజు, వ్యవసాయ అధికారి

బీసీలను నిండా ముంచింది.. బీఆర్‌ఎస్సే



ఏర్గట్లలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

ఏర్గట్ల, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): బీసీలను నిండా ముంచింది బీఆర్‌ఎస్ పార్టీయేనని జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు శివన్నోల్ల శివకుమార్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ బీఆర్‌ఎస్ పదేళ్ల అధికారంలో ఉన్నప్పుడు కాంగ్రెస్ పార్టీ ఏర్పాటు చేసిన బీపీ మండల కమిషన్ ద్వారా కల్పించిన బీసీలకు 27 శాతం రిజర్వేషన్‌ను 23 శాతానికి తగ్గించి 285సి జీవో తెచ్చి 50 శాతం రిజర్వేషన్ సీలింగ్ విధించి బీసీ వర్గాలను నిండా ముంచిన ఘనత బీఆర్‌ఎస్ పార్టీదని అన్నారు. ప్రతిపక్ష పార్టీలు ముందుంటున్నామని తెలుపుతూ వెనక నుండి కేసులు వేయిస్తు న్నారన్నారు. రిజర్వేషన్‌ల విషయంలో ఏ పార్టీ చిత్తుశుద్ధితో ఉందో ప్రజలే గమ నిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు దండెవోయి న సాయికుమార్, ముని మాణిక్యం అంజయ్, మెరుగు సురేష్, రమేష్, ముఖేష్‌లు పాల్గొన్నారు.

సుందరయ్య కాలనీ సమస్యలు పరిష్కరించాలి

ఆర్మూర్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని యానం గుట్ట సమీపంలో గల సుందరయ్య కాలనీ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శనివారం సీపీఎం నాయకులు ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డిని అంకాపూర్‌లో కలిసి వినతిపత్రం అందజేశారు. సుందరయ్య కాలనీలో ప్రభుత్వ స్థలంలో గుడిసెలు వేసుకొని నివాసం ఉంటున్నామని విద్యుత్, తాగునీటి సౌకర్యం కల్పించాలని వారు ఎమ్మెల్యేకు విన్నవించారు. కరెంట్ సౌకర్యం లేక పోవడంతో రాత్రి సమయంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని వారు ఎమ్మెల్యేకు తెలిపారు. త్వరలోనే సుందరయ్య కాలనీకి వచ్చి సమస్యలు పరిశీలించి పరిష్కారం చేసేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి వారికి హామి ఇచ్చారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో సీపీఎం నాయకులు పల్లపు వెంకటేష్, రవి, సాయిలు, సాజిద్‌ఖాన్, నదీమ్, సునిత, అనిత, రజియా సుల్తానా, కాలనీవాసులు పాల్గొన్నారు.

కోతుల బెడద తీరేదెన్నడో?

- గ్రామాల్లో పెరిగిన వానర సంచారం
- ప్రజలపై విచ్చలవిడిగా దాడులు
- నెలల వ్యధిలో పదుల సంఖ్యలో బాధితులు
- చోద్యం చూస్తున్న అధికారులు

ఎల్లారెడ్డి, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డి మండలంలో కోతుల బెడద తీవ్రంగా ఉంది. నియోజకవర్గంలోని అన్ని మండలాల పరిధిలో అటవీ ప్రాంతం ఉండటం సరైన ఆహార సౌక ర్యాలు లేకపోవడంతో అటవీని వదిలి కోతులు జనావాసాల్లోకి వస్తున్నాయి. దీతో పొద్దున లేచిన దగ్గర నుంచి సాయంత్రం చీకటి పడే వరకు ఇళ్ళు, దుకాణాల్లోకి కోతులు చొరబడి ఆహార పదార్థాలను ఎత్తుకెళుతుండటంతో పొద్దస్తమానం తలుపులు వేసుకుని ఉండాల్సి వస్తుంద ని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. గ్రామాల్లో రోజురోజుకూ కోతుల సంతతి బాగా పెరిగిపోతుందని వాహనదారులు, చిన్నారులు వాటి నుంచి తప్పించుకోవడానికి నానా ఆగచాట్లు పడాల్సి వస్తుందని ప్రజలు వాపోతు న్నారు. నెలల వ్యవధిలోనే పదుల సంఖ్యలో బాధితులు ఉంటున్న మున్సిపల్, గ్రామ పంచాయితీ అధి కారులు చోద్యం చూస్తున్నారని పేర్కొంటున్నారు.

● ఇళ్లు, పొలాలను చిందర వందర చేస్తున్న వానరాలు

కోతులు ఇంటిపై రేకులు, పెంకులు నాశనం చేస్తూ నానా హంగామా చేస్తున్నాయి. ఇంటి ఆవరణలో ఉన్న పండ్ల చెట్లు, కూరగాయలను సైతం వదిలిపెట్టడం లేదు. అంతేగాక మొక్క జొన్న పంటల్లో కోతులు గుంపులుగా తిరుగుతూ పంటల ఆకులు, కాయలు తుంచేస్తుండటంతో రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారు. కోతుల భారీ నుంచి పంటలను కాపాడుకునేందుకు ఓ వైపు దినసరి కూలీలను పంట పొలాల వద్ద కాపాలా ఉంచడమో లేదా వివిధ వేషధారణలతో ఉండి వస్త్రాలను, దిష్టి బొమ్మలను కొనుగోలు చేసి పంట పొలాల్లో పెడుతూ కోతులను సాగ నంపే ప్రయత్నాలు చేస్తున్నారు. ఎన్ని చేసినా రైతులకు మాత్రం కోతుల బెడద తీరకపోవడంతో వాటిని పట్టి దూర ప్రాంతాలకు తరలించాలని రైతులు కోరుతున్నారు.

● ఖాళీ ఇళ్లే నివాసాలుగా..

కోతులు ఆహార శాల అంటూ ఏర్పాటు చేసిన మొక్కల పెంపకంపై అధికారులు సరిగ్గా దృష్టి సారించకపోవడంతో చెట్లు అంతంత మాత్రంగానే పెరిగి వాటికి తినేందుకు ఆహారం దొరకక మళ్లీ గ్రామాలపై పడు తున్నాయి. గ్రామాల్లోని భారీ వృక్షాలు ఎవరకూ నివసించకుండా ఖాళీ గా ఉండే ఇళ్లను వాటి ఆవసా కేంద్రా లుగా ఏర్పాటు చేసుకుని సంచ రిస్తు న్నాయి. రాత్రంతా భారీ వృక్షాలపై లేదంటే ఖాళీగా ఉన్న ఇళ్ళలో ఉండి తెల్లవారితే ఆహారం కోసం ఇళ్ల లోకి ప్రవేశిస్తున్నాయి. ఇంట్లో ఉన్న సామ గ్రిని చిందరవందరగా చేయడం, ఆహార పదార్థాలు ఎత్తుకుని పోవ డం తో పాటు గుంపులు గుంపులుగా సంచరిస్తున్నాయి. ఖాళీగా ఉండే ఇళ్లను వాటి ఆవాస కేంద్రాలుగా ఏర్పాటు చేసుకుని సంచరిస్తున్నాయి. రాత్రంతా భారీ వృక్షాలపై లేదంటే ఖాళీగా ఉన్న ఇళ్ళలో ఉండి తెల్లవారితే ఆహారం కోసం ఇళ్లలోకి ప్రవేశిస్తున్నాయి. ఇంట్లో ఉన్న సామగ్రిని చిందర వందర గా చేయడం, ఆహార పదార్థాలు ఎత్తుకునిపోవడంతో పాటు గుం పులు గుంపులుగా సంచరిస్తూ ఇంట్లో నుంచి ఎవరిని బయటకు రా కుండా చేస్తున్నాయి. రహదారులపై కూరగాయాలు, సరుకులు, తదితర సామగ్రి తీసుకుని వెళుతున్న పాదాచారులు, ద్విచక్ర వాహన దారులపై దాడి చేస్తుండటంతో వారు సైతం గాయపడుతున్నారు.



ఎల్లారెడ్డిలో రోడ్లపై కోతుల గుంపు

● కోతుల సంతతిని తగ్గించేలా చర్యలు తీసుకోవాలి

మా గ్రామంలో కోతుల బెడద బాగా పెరిగింది. వాహనదారులు, చిన్నారులపై గుంపులుగా వచ్చి దాడి చేస్తున్నాయి. దీంతో వీధుల్లో తిరగాలంటే భయపడే పరిస్థితి ఏర్పడుతుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి వాటి సంతతిని తగ్గించేందుకు కృషి చేయాలి.

- రఘువీర్ గౌడ్, మాజీ సర్పంచ్ కళ్యాణి



సమావేశంలో మాట్లాడుతున్న బీసీ సంఘం నాయకులు

రిజర్వేషన్ల అమలును అడ్డుకోవడం సిగ్గుచేటు

భిక్కనూరు, అక్టోబరు 11, (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో బీసీ రిజర్వేషన్ల అమలును అగ్రకుల నాయకులు అడ్డుకోవడం సిగ్గుచేటని బీసీ సంఘం భిక్కనూరు మండల నాయకులు అన్నారు. శనివారం వారు మీడియాతో మాట్లాడుతూ.. బీసీలకు ప్రభుత్వం 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తే అగ్రవర్ణ కులాల నాయకులు అడ్డుకున్నారని ఆరోపించారు. చేతగాని కాంగ్రెస్ ప్రభుత్వం వల్లనే హైకోర్టులో స్టే వచ్చిందని విమర్శించారు. వెంటనే పిటిషన్స్ విత్‌డ్రా అయ్యేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గతంలో ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లను తాము వ్యతిరేకించలేదని, అలాంటప్పుడు బీసీ రిజర్వేషన్లను ఎందుకు అడ్డుకున్నాయో చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రవీందర్, లక్ష్మీనర్సింలు, బండి ఎల్లయ్య, గంగాధర్, గజ్జె వేణు, తదితరులు పాల్గొన్నారు.



రోగులకు పండ్లు, దుప్పట్లను పంపిణీ చేస్తున్న రాజమౌళి

రోగులకు పండ్లు, దుప్పట్ల పంపిణీ

భిక్కనూరు, అక్టోబరు 11, (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో రోగులకు, సిబ్బందికి భిక్కనూరు ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు పురం రాజమౌళి దుప్పట్లు, పండ్లు, పాలను శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇలాంటి సేవా కార్యక్రమాలను ముందు కొనసాగిస్తానని చెప్పారు. సేవా కార్యక్రమాలను చేయడం వల్ల తృప్తి ఉంటుందన్నారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యేకు కొత్త బాధ్యతలు



ఎల్లారెడ్డి రూరల్, అక్టోబరు 11, (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ అసెంబ్లీ స్థానానికి జరగనున్న ఉప ఎన్నికల ప్రచారంలో భాగంగా షేక్‌పేట్ డివిజన్ ఇంచార్జిగా శనివారం ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ బాధ్యతలు స్వీకరించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఉప ఎన్నికల ప్రచారంలో బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి నాయకత్వంలో బీఆర్ఎస్ అధిష్ఠానం షేక్‌పేట్ డివిజన్ ఇంచార్జిగా తనను నియమించారని తెలిపారు. అహర్నిశలు కష్టపడి బీఆర్ఎస్ అభ్యర్థి గెలుపు కోసం ఇంటింటి ప్రచారం చేస్తూ కృషిచేస్తానని అన్నారు. తనపై నమ్మకంతో ఈ బాధ్యతలు అప్పగించిన పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు, ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డికి కతజ్ఞతలు తెలిపారు.

బీజేపీలోకి తిప్పాపూర్ వీడీసీ ఉపాధ్యక్షుడు



బీజేపీలో చేరుతున్న రాజు

భిక్కనూరు, అక్టోబరు 11, (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిప్పాపూర్ గ్రామ వీడీసీ ఉపాధ్యక్షుడు నారిగల్ల రాజు శనివారం ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి సమక్షంలో బీఆర్ఎస్ పార్టీ నుంచి బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా రాజుకు ఎమ్మెల్యే పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కేంద్ర ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పథకాలు, కామారెడ్డిలో ఎమ్మెల్యే నాయకత్వం నచ్చి బీఆర్ఎస్‌కు రాజీనామా చేసి బీజేపీలో చేరడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా కార్యదర్శి రాజశేఖర్‌రెడ్డి, బీజేపీ మండల అధ్యక్షుడు రమేష్, తదితరులు పాల్గొన్నారు.

నడి వయసులోనూ.. నడుము వంచలేక..

(5వ పేజీ తరువాయి)

లేకపోవడం కీళ్లకు పోషణ తక్కువ కావడం, అధిక బరువు, స్థూలకాయం వల్ల వాటిపై ఒత్తిడి పెరగడం వల్ల ఆర్థరైటిస్ బాధితులు పెరుగుతున్నారు. ఎక్కువగా కూర్చుండి పని చేసే ఉద్యోగాల కారణంగా కీళ్ల కదలికలు తగ్గిపోయి, పని చేయకపోవడం, గట్టిపడటం తదితర మార్పులు వస్తాయి.

ఎలాంటి సమస్యలు వస్తాయి..

ఆర్థరైటిస్ వంద రకాలు ఉంటుందని గుర్తించినప్పటికీ.. సాధారణంగా ఆస్టియో ఆర్థరైటిస్, రుమటాయిడ్ ఆర్థరైటిస్, సోరియాటిక్ ఆర్థరైటిస్ గౌట్, ల్యూపస్ అనే ఐదు రకాలుగా ఉంటాయి. చేతులు, కాళ్లు కదలించలేకపోవడం, నడవడంలో ఇబ్బంది, కూర్చుండి లేవలేకపోవడం ఏదైనా వస్తువులను సరిగ్గా పట్టుకోలేక పోవడం వంటి సమస్యలు వస్తుంటాయి. జాయింట్లలో వచ్చే ఇన్‌ఫెక్షన్ల కారణంగా ఆర్థరైటిస్ సమస్య కనిపిస్తోంది. జీవనశైలి మార్పు వల్లే ఆర్థరైటిస్ రావడానికి ప్రధాన కారణంగా చెప్పవచ్చు. శారీరక శ్రమ లేకపోవడం, వ్యాయామం చేయకపోవడం, జంక్ ఫుడ్ తినడం, ఒత్తిడి పెరగడం ఆర్థరైటిస్‌కు దారి తీస్తోంది. కొన్ని రకాల జీవనశైలి మార్పులతో ఆర్థరైటిస్‌ను అదుపు చేయవచ్చు. బరువును నియంత్రించుకొని, క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలి.

చికిత్స ఇలా..

మంచి చికిత్స అందిస్తే కీళ్ల సమస్యలు అదుపులో ఉంటాయి. ఒకవేళ సరైన చికిత్స అందించకపోతే శరీరంలోని ముఖ్యమైన అవయవాల మీద వీటి ప్రభావం పడి, వాటి పని తీరులో తీవ్రమైన మార్పు రావచ్చు. ఒక్కోసారి ఈ సమస్య కారణంగా కొందరిలో చూపు పోవడం, గుండెపోటు, పక్షవాతం, మూత్రపిండాలు దెబ్బతినే ప్రమాదం ఉంది. ఇవీ జాగ్రత్తలు కీళ్ల సమస్యల నుంచి ఉపశమనం పొందేందుకు ఎముకలకు కాల్షియం, డి3 విటమిన్ అందేలా ఆహారం తీసుకోవాలి. ఫైబర్ ఎక్కువగా లభించే ముడిగింజలు, బిక్కుళ్లు, పండ్లు, కూరగాయలు తినాలి. ఎక్కువసేపు ఒకే చోట కూర్చోకుండా చూసుకోవాలి. కంప్యూటర్లపై పని చేసే వారు ప్రతీ 15-20 నిమిషాలకు ఒకసారి లేచి నిల్చోవాలి. మందులు, ఫిజికల్ థెరపీకి తగ్గనప్పుడు మాత్రమే సర్జరీ అవసరమవుతుంది.

వ్యాయామంతో సంపూర్ణ ఆరోగ్యం

తగిన బరువును కాపాడుకోవడం, ప్రతిరోజూ తేలికపాటి వ్యాయామం చేయడం ద్వారా కీళ్ల రుగ్మతల నుంచి కాపాడుకోవచ్చు. సమతుల్య ఆహారం తీసుకోవడం, స్వచ్ఛందంగా మందులు వాడకపోవడం వంటి జాగ్రత్తలు తీసుకుంటే వ్యాధి నియంత్రణలో ఉంటుంది. ఆధునిక వైద్య పద్ధతులు కీళ్ల పునరుద్ధరణ శస్త్ర చికిత్సల ద్వారా ఆర్థరైటిస్ రోగులు కూడా సుఖమైన జీవితం గడపవచ్చు.

- డాక్టర్ రామకోటేశ్వర రావు, ఆర్థోపెడిక్ సర్జన్, మెడికవర్ ఆస్పత్రి, నిజామాబాద్

డీసీసీపై ఫోకస్

(5వ పేజీ తరువాయి)

పదవి ఎవరిని వరిస్తుందోనని ఆసక్తి క్యాడర్‌లో చర్చ మొదలైంది. డీసీసీ అధ్యక్షులు ఎన్నికయ్యేవారు కీలకంగా వ్యవహరించనున్నందున పదవిపై పలువురు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రస్తుతం డీసీసీ అధ్యక్షుడిగా కైలాస్ శ్రీనివాస్‌రావు జిల్లా ఏర్పడినప్పటి నుంచి ఆయనే పదవిలో ఉన్నారు. అయితే కైలాస్ శ్రీనివాస్‌రావు కొందరికి మాత్రమే అనుకూలంగా ఉంటున్నారని ఓ వర్గానికి అనుకూలించడం లేదని పార్టీశ్రేణుల్లో చర్చ సాగుతోంది. ఈ నేపథ్యంలో మరోసారి ఆయనకు పదవి ఇవ్వడం కష్టమేనని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ప్రస్తుతం కాంగ్రెస్ అధికారంలో ఉండడంతో అధ్యక్ష పీఠంపై పలువురు సీనియర్ నేతలు దృష్టి సారించారు. కామారెడ్డి, ఎల్లారెడ్డి, బాన్సువాడ, జుక్కల్ నియోజకవర్గాల నుంచి పలువురు సీనియర్ నేతలు డీసీసీ పదవికి ప్రయత్నాలు ముమ్మరం చేశారు. అదేవిధంగా ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేలు సైతం తమ అనుచరవర్గానికి పదవులు కట్టబెట్టేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. డీసీసీ రేసులో పలువురు సీనియర్ నేతల పేర్లు వినిపిస్తున్నప్పటికీ అందరిని కలుపుకుపోయే మనస్తత్వం, ఆర్థిక, అంగబలం ఉన్న నేతలకు పదవిని కట్టబెట్టాలని అధిష్ఠానం భావిస్తోంది.

వంతెనకు మరమ్మతులు.. రాకపోకలు షురూ

ధర్పల్లి, అక్టోబరు11, (ఆంధ్ర జ్యోతి): మండలంలోని దుబ్బా క, ధర్పల్లి గ్రామాల మధ్యగల వంతెన ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కూలిపోయింది. దీం తో మండలకేంద్రానికి దుబ్బాక గ్రామస్థులకు సంబంధాలు తె గిపోయాయి. రాకపోకలకు తీ వ్ర ఇబ్బందులు ఎదురయ్యా యి. స్పందించిన నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి తాత్కాలిక మర మ్మతుల కోసం నిధులు మంజూరు చేయగా పనులను యుద్ధప్రాతిపదికన చేశారు. దీంతో రాకపోకలకు అంతరాయం లేకుండా ఏర్పడింది. బ్రిడ్జి మరమ్మతుల కోసం నిధులు మంజూరు చేసిన రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డికి ధర్పల్లి, దుబ్బాక గ్రామస్థులు, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు చిన్నబాల్‌రాజ్ కృతజ్ఞతలు తెలిపారు.



తెగిన బ్రిడ్జిని రాకపోకలకు అనువుగా చేసిన దృశ్యం

పేకాట స్థావరంపై దాడి

లింగంపేట, అక్టోబర్ 11 (ఆంధ్రజ్యోతి) : లింగంపేట మండలంలోని ఐలాపూర్‌లో శనివారం పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేసి ముగ్గురిని పట్టుకున్నట్లు ఎస్సై దీపక్‌కుమార్ తెలిపారు. పక్కా సమాచారం మేరకు పోలీసులు పేకాట స్థావరంపై దాడి చేసినట్లు ఆయన తెలియజేశారు. వారి వద్ద నుంచి రూ.3250 నగదుతో పాటు బైక్‌లు, సెల్‌ఫోన్‌లు సీజ్ చేశామన్నారు.



స్వీట్ తినిపిస్తున్న సీపీ సాయి చైతన్య

నీట్‌లో విద్యార్థి ప్రతిభ సీపీ అభినందన

సుభాష్‌నగర్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): నీట్‌లో 289 ర్యాంకు సాధించి మెడికల్ సీటు పొందిన కానిస్టేబుల్ సతీష్ కుమారుడు ఛత్రపతిని సీపీ సాయిచైతన్య అభినందించారు. శనివారం జిల్లా కేంద్రంలోని పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో స్వీట్ తినిపించి అభినందించారు. జిల్లాకేంద్రంలోని మెడికల్ కాలేజీలో సీటు సాధించడం అభినందనీయమని పేర్కొన్నారు. సీపీని కలిసిన వారిలో కానిస్టేబుల్ సతీష్, తదితరులు ఉన్నారు.

మెడికల్ సీట్లు సాధించిన ఎస్ఆర్ విద్యార్థులకు సన్మానం



విద్యార్థులను సన్మానిస్తున్న ఎస్ఆర్ డీజీఎం గోవర్ధన్‌రెడ్డి, జోనల్ ఇన్‌చార్జి శ్రీకాంత్, తదితరులు

ఇందూరు, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): నీట్‌లో ఉత్తమ ర్యాంకులు సాధించి రాష్ట్రంలోనే ప్రతిష్ఠాత్మకమైన మెడికల్ కళాశాలలో సీట్లు సాధించిన ఎస్ఆర్ విద్యార్థులను శనివారం జిల్లాకేంద్రంలో కళాశాల ప్రతినిధులు సన్మానించారు. గంగాస్థాన్ ఎస్ఆర్ క్యాంపస్‌లో నిర్వహించిన కార్యక్రమంలో 2023-25 విద్యాసంవత్సరంలో ఎస్ఆర్ కళాశాల విభాగంలో రెగ్యూలర్ ఇంటర్‌తో పాటు నీట్ కోచింగ్ తీసుకున్న విద్యార్థులు 13 మంది ఎంబీబీఎస్ సీటు సాధించారు. వీరిలో 8 మంది ప్రభుత్వ మెడికల్ కళాశాలలో, 3 ప్రైవేటు మెడికల్ కళాశాలలో, మరో ఇద్దరు విద్యార్థులు బీడీఎస్ సీట్లను సాధించారు. ఈ సందర్భంగా విద్యార్థులను విద్యాసంస్థల డీజీఎం గోవర్ధన్‌రెడ్డి, జోనల్ ఇంచార్జి శ్రీకాంత్ అకాడమి రాంబాబు ఇతర క్యాంపస్ ప్రిన్సిపల్ హన్మంత్‌రెడ్డి, దేవేందర్‌రెడ్డి, మైపాల్‌రెడ్డి తదితరులు సన్మానించారు. ఈ సందర్భంగా డీజీఎం గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ.. నీట్‌లో మంచి కోచింగ్‌తో పాటు సీనియర్ అధ్యాపకుల బోధన, వారంతపు పరీక్షలు, ప్రతిరోజు స్టడీ అవర్స్ విద్యార్థులకు సందేహాల నివృత్తి చేయడం వంటి కార్యక్రమాలు నిర్వహించడం వల్లే మంచి ర్యాంకులు సాధించామన్నారు.

నకిలీ నోట్ల ముఠా గుట్టురట్టు

(5వ పేజీ తరువాయి)

పండిత్ శరత్‌కజా, యూపీకి చెందిన లఖన్‌కుమార్ దుబే, బ్రిజేష్‌కుమార్, సత్యదేవ్‌యాదవ్, మహారాష్ట్రకు చెందిన ప్రమోద్‌లతో కలిసి నకిలీనోట్లను తయారు చేసుకునేందుకు ముడిసరుకులను కొనుగోలుచేశారని తెలిపారు.

● ఫేస్‌బుక్ ద్వారా పరిచయమైన వివిధ నెంబర్ల క్యూఆర్ కోడ్‌లకు డబ్బులు పంపించుకుని ఫేక్‌నోట్లను కొరియార్ చేశారని తెలిపారు. నకిలీ నోట్ల వ్యవహారంలో మొత్తం 12 మందిని గుర్తించామని, గతంలో నలుగురిని, ఈనెల 3న మరో నలుగురిని అరెస్ట్‌చేసి రిమాండ్ పంపినట్లు తెలిపారు. మిగిలిన నలుగురిని త్వరలోని పట్టుకుని రిమాండ్‌కు తరలిస్తామని తెలిపారు. నిందితుల వద్ద నుంచి రూ.3లక్షల8వేల 300ల నకిలీనోట్లు, రూ.15,300ల అసలైన నోట్లు, రూ.8,830ల తాత్కాలిక ప్రింటెండ్ నోట్లు, కారు, 9 సెల్‌ఫోన్లు, ప్రింటింగ్ సంబంధించిన పరికరాలు, కంప్యూటర్‌లు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. నిందితులను పట్టుకున్న సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, పట్టణ సీఐ నరహరి, ఎస్ఎస్‌నగర్ సీఐ సంతోష్, ఎస్ఐలు రాజు, రాజశేఖర్ తదితరులను ఎస్పీ అభినందించారు. ఈ సమావేశంలో ఏఎస్పీ చైతన్యరెడ్డి, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.



వాహనాలను తనిఖీ చేస్తున్న ఏఎస్సై

వాహనాల తనిఖీలు

లింగంపేట, అక్టోబర్ 11, (ఆంధ్రజ్యోతి): లింగంపేట మండలంలోని ముస్తాపూర్ వద్ద శనివారం ఏఎస్సై నారాయణ ఆధ్వర్యంలో పోలీసులు వాహనాలను తనిఖీ చేసి జరిమానాలు విధించారు. అప్పటికే జరిమానాలు ఉన్న వాహనదారుల నుంచి డబ్బులు రికవరీ చేశారు. ఈ సందర్భంగా ఏఎస్సై మాట్లాడుతూ.. వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్, సీటు బెల్టు ధరించాలని, మద్యం తాగి వాహనాలను నడపరాదని ఆయన సూచించారు. అతివేగం ప్రాణాంతకమని అన్నారు. కార్యక్రమంలో కానిస్టేబుల్స్ ఉన్నారు.

కాంగ్రెస్‌కు గుణపాఠం చెప్పాలి



తాడ్వాయి, అక్టోబరు 11, (ఆంధ్రజ్యోతి): బీసీ రిజర్వేషన్ల పేరుతో కాంగ్రెస్ పార్టీ చేసిన మోసం తేటతెల్లమైందని తాడ్వాయి మండల బీఆర్ఎస్ యూత్ అధ్యక్షుడు రమేష్ రావు అన్నారు. ఈ సందర్భంగా శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఇన్నాళ్లుగా కాంగ్రెస్ అడ్డగోలు విధానాలతో బీసీలకు ఇచ్చిన 42 శాతం హామీని తుంగలో తొక్కిందని విమర్శించారు. న్యాయస్థానంలో నిలబడలేని జీవోతో ప్రజలను మభ్యపెట్టడం దారుణమని అన్నారు. ఎన్నికల ముంగిట బీసీ రిజర్వేషన్ల అంశాన్ని వాడుకొని ఎన్నికలు వాయిదా వేయాలని కుట్రపన్నిందని ఆరోపించారు. బీసీ బిల్లుకు చట్టబద్ధత కల్పించిన తర్వాత స్థానిక సంస్థ ఎన్నికలకు వెళ్లాలని బీసీలను మోసం చేసిన కాంగ్రెస్‌కు ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని అన్నారు.



అన్నదాతను సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

చాముండేశ్వరి ఆలయంలో అన్నదానం

దోమకొండ, అక్టోబరు 11, (ఆంధ్రజ్యోతి): దోమకొండ చాముండేశ్వరి ఆలయ 54వ వార్షికోత్సవ ఉత్సవాల్లో భాగంగా శనివారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆ సందర్భంగా అన్నదానానికి సహకరించిన కామారెడ్డికి చెందిన దంపతులు రేఖ- రాజేష్‌లను ఆలయకమిటీ సభ్యులు సన్మానించారు. కమిటీ అధ్యక్షుడు సిద్దారెడ్డి, ధర్మకర్తలు వెంకటేశం, రమేష్, మండల కాంగ్రెస్ అధ్యక్షు డు అనంతరెడ్డి, నాయకులు నర్సారెడ్డి, మర్రి శేఖర్, రామచంద్రం, శరత్‌చంద్ర పాల్గొన్నారు.

వీహెచ్‌పీ కార్యవర్గం ఎంపిక

కామారెడ్డిటౌన్, అక్టోబరు 11, (ఆంధ్రజ్యోతి): విశ్వహిందూ పరిషత్ జిల్లా కార్యవర్గాన్ని శనివారం ఎన్నుకున్నట్లు ఆ యూనియన్ అధ్యక్షుడు నిత్యానందం తెలిపారు. జిల్లా ఉపాధ్యక్షురాలిగా మంజుల, నగర కార్యదర్శిగా గడ్డమీది అరవింద్, నగరసేవా ప్రముఖ్‌గా కైరా రాజేశ్వర్‌గౌడ్, మాతృశక్తి జిల్లా సహ సంయోజక్‌గా పుష్ప, నగర ధర్మ ప్రసాద ప్రముఖ్‌గా స్వామి, నగర సహ సత్సంగ్ ప్రముఖ్ భూమేష్‌లను నియమించడం జరిగిందని తెలిపారు.

వన్ వేతో వ్యాపారాలు నడవడం లేదు

సుభాష్‌నగర్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): నగరంలోని దేవీ రోడ్‌లో ట్రాఫిక్ పోలీసులు వన్‌వే ఏర్పాటు చేయడంతో దుకాణ సముదాయాల యజమానులు బంద్ పాటించారు. శనివారం దుకాణాలను మూసివేసి నిరసన తెలిపారు. అనంతరం కమిషనరేట్‌కు వెళ్లి సీపీ సాయిచైతన్యకు వినతిపత్రం అందజేశారు. తర్వాత పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్‌ను కలిసి వన్‌వే చేయడంతో వ్యాపారాలు సరిగా సాగడం లేదని వివరించారు. గత నెలరోజులుగా వన్‌వే చేయడం వల్ల వ్యాపారాలు సరిగ్గా సాగడం లేదని, ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. ట్రాఫిక్‌కు ఇబ్బందులు లేకుండా వ్యాపారాలు సాగేలా చర్యలు తీసుకోవాలన్నారు.

పీసీసీ చీఫ్‌ను కలిసిన పద్మశాలీ నేతలు

ఇందూరు, అక్టోబరు11(ఆంధ్రజ్యోతి): నిజామాబాద్ జిల్లా పద్మశాలి మహిళా సంఘం ప్రతినిధులు టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్‌ను శనివారం కలిసి సన్మానించారు. సంఘం జిల్లా అధ్యక్షురాలు అన్నపూర్ణ ఆధ్వర్యంలో పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు.



పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్‌తో మాట్లాడుతున్న దుకాణాదారులు

భారత రాజ్యాంగంపై దాడి

నిజామాబాద్ కల్చరల్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): చీఫ్ జస్టిస్‌పై దాడి భారత రాజ్యాంగం పై దాడి అని అడ్వకేట్ ఆశనారాయణ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని మహిళ సంఘాలు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ భారత రాజ్యాంగానికి లోబడి న్యాయస్థానం పనిచేస్తుందని అలాంటి ప్రధాన న్యాయమూర్తిపై దాడి చేయడం అమానుషమని అన్నారు. అన్యాయం జరిగితే న్యాయస్థానంకు వెళ్లి న్యాయాన్ని సాధించుకోవాలి తప్ప భౌతిక దాడులకు దిగడం సమంజసం కాదని అన్నారు. కేంద్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే దేవాలయాలతో పాటు నిరుద్యోగులకు ఉపాధి కల్పించి ఇలాంటి దాడులు జరుగకుండా గట్టి చర్యలు తీసుకోవాలని అన్నారు. ఐద్వా జిల్లా అధ్యక్షురాలు అనిత, ప్రగతిశీల మహిళా అధ్యక్షురాలు గోదావరి ఉన్నారు.

ప్రశ్నించేతత్వాన్ని అలవర్చుకోవాలి

సిరికొండ,అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులు ప్రశ్నించే తత్వాన్ని అలవర్చుకోవాలని యూఎఫ్ఆర్‌టీఐ రాష్ట్ర కోకన్వీనర్ అంకం నరేష్ కోరారు. సిరికొండ మండలకేంద్రంలోని మోడల్ స్కూల్‌లో శనివారం సమాచార హక్కు చట్టంపై అవగాహన కల్పించారు. పంచాయతీ మొదలుకొని, భారత పార్లమెంటు వరకు ప్రతి ప్రభుత్వ కార్యాలయాల్లో ఎక్కడైనా సమాచార హక్కు చట్టం కింద కావాల్సిన సమాచారాన్ని పొందవచ్చని నరేష్ విద్యార్థులకు వివరిం చారు. దేశంలోని ఆసక్తికరమైన సంఘట నలు, ఉపకార వేతనాలు, పరీక్షల మార్కులు మొదలైన వివరాలను తెలుసుకునేందుకు స మాచార హక్కు చట్టంను విద్యార్థులు ఉప యోగించుకోవాలని సూచించారు. సమాచార హక్కు చట్టం కరపత్రాలను యూఎఫ్ ఆర్‌టీఐ జిల్లా కన్వీనర్ మురళి, ప్రిన్స్‌పాల్ రాజేశ్‌రెడ్డి, అధ్యాపకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆవిష్కరించారు.



విద్యార్థినులకు బహుమతులు అందజేస్తున్న ప్రిన్సిపాల్ లక్ష్మీబాయి

ఘనంగా అంతర్జాతీయ బాలికా దినోత్సవం

బాన్సువాడ రూరల్, అక్టోబరు 11, (ఆంధ్రజ్యోతి): బాన్సువాడ మండలంలోని తాడ్కోల్ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో ఏఎస్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ వ్యవస్థాపకులు సంతోష్ మాట్లాడుతూ.. ప్రాచీన కాలం నుంచి నేటి వరకు బాలికలు విద్య, ఆరోగ్యం, లింగ వివక్షత, భద్రత, ఆర్థిక అసమానతలు వివిధ రంగాల్లో వివక్షతకు గురవుతున్నారని అన్నారు. అంబేద్కర్ రూపొందించిన రాజ్యాంగం వల్లనే వారికి స్వేచ్ఛ, సమానత్వం, విద్యా, రాజకీయ, ఆర్థిక రంగాల్లో అవకాశాలు దక్కుతున్నాయని, అందుకే వారు రాణించడం గర్వించదగ్గ విషయమన్నారు. అనంతరం విద్యార్థినులకు వ్యాసరచన పోటీలను నిర్వహించి బహుమతులను అందజేశారు. ప్రిన్సిపాల్ లక్ష్మీబాయి, ఫౌండేషన్ సభ్యులు శివరాజులు, మంజుల, శ్రీవాణి, సుజాత, గౌసియా, పాల్గొన్నారు.

వానర దండు.. సమస్యలు మెండు

▸▸ ఇళ్లపైనే తిష్టవేస్తున్న కోతులు ▸▸ చిన్నపిల్లలపై దాడులు ▸▸ భయాందోళనలో ప్రజలు

మహమ్మద్‌నగర్, అక్టోబరు 11, (ఆంధ్రజ్యోతి): అడవుల్లో ఉండాల్సిన కోతులు గ్రామాల్లో తిష్ట వేస్తున్నాయి. ఆహారం కోసం ఇళ్లలోకి వస్తూ ఇబ్బంది పెడుతున్నాయి. దీంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. మహమ్మద్‌నగర్ మండలం నర్వ గ్రామంలో కోతుల బెడద తీవ్రతరంగా మారింది. అడవుల్లో ఉండాల్సిన కోతులు గ్రామాల్లోకి రావడంతో ప్రజలు జంకుతున్నారు. ఇళ్లల్లో తినుబండారాలను ఎత్తుకెళ్లడం, చిన్నపిల్లలను గాయపరుస్తున్నాయి. అంతేకాకుండా ఇళ్లల్లో ఉండే నిత్యావసర సరుకులు ఎత్తుకెళ్లి పాడుచేస్తున్నాయని ప్రజలు చెబుతున్నారు. మండల వ్యాప్తంగా ఇదేతంతు కొనసాగుతుంది. అడవిలో ప్రత్యేకంగా వీటికి కోతుల ఆహార కేంద్రాలు ఏర్పాటుచేసినప్పటికీ వాటిలో ఎలాంటి పండ్లు లేకపోవడం, అడవుల్లో ఆహారం దొరకకపోవడంతో జనవాసాలపై ఉంటున్నాయని ప్రజలు ఆరోపిస్తు న్నారు.



నర్వ గ్రామంలో ఇళ్లపైనే కోతుల గుంపులు

ఇంత జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని చెబుతున్నారు. కోతులను దూర ప్రాంతాలకు తరలించాలని కోరుతున్నారు.

జోనల్ లెవల్ పోటీలకు ఎంపికలు

దోమకొండ, అక్టోబరు 11, (ఆంధ్రజ్యోతి): దోమకొండ మండల కేంద్రంలోని బాలికల ప్రభుత్వ పాఠశాలలో శనివారం జోనల్ లెవల్ వాలీబాల్ పోటీలకు ఎంపికలు నిర్వహించారు. పీడీ సాయిమౌర్య మాట్లాడుతూ.. 14 నుంచి 17ఏళ్ల బాలబాలికలకు ఎంపికలు నిర్వహించామని తెలిపారు. ఆర్పరీ అధ్యక్షుడు తిర్మల్ గౌడ్, పీడీలు నరసింహారెడ్డి, అనిల్‌కు మార్, రామకృష్ణ, అంజనేయులు, నరేందర్, బాపురెడ్డి, బాలకిషన్, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.



ఎంపికలో పాల్గొన్న క్రీడాకారులు

సినిమా గైడ్

కామారెడ్డి

ప్రియ 70- కానిస్టేబుల్
ప్రియ 35- కాంతార
దర్శన్- మిరాయి

బాన్సువాడ

మహేశ్వరి — ఓజీ
వెంకటేశ్వర — కాంతారా

చికెన్ ధరలు

రకం	సుగుణ	వెన్‌కాబ్
లైవ్	రూ.140	రూ.150
స్కిన్	రూ.200	రూ.210
స్కిన్‌లెస్	రూ. 220	రూ.230